ప్రజాశక్తి

బుధవారం 29 జనవరి 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

అందరి నోట సమస్యల మాట

- వాడీవేడిగా డిఆర్‌సి
- రేషన్ మాఫియాను అరికట్టండి
- గళమెత్తిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లో వాడీవేడిగా జరిగింది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన మూడున్నర గంటల పాటు జరిగిన సమావేశంలో పలు సమస్యలపై అధికార, ప్రతిపక్ష పార్టీ సభ్యులంతా ప్రస్తావించారు. రేషన్ మాఫియాపై అధికార పార్టీ ఎమ్మెల్యేలు దూళిపాళ్ల నరేంద్ర, తెనాలి శ్రావణ్‌కుమార్, బి.రామాంజనేయులు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు అంశాలపై అధికారులు నిర్లిప్తంగా సమాధానాలు, తక్షణం స్పందించాల్సిన అంశాలపైనా మొక్కుబడిగా స్పందించడంపై ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో వ్యవసాయ అనుబంధ శాఖలు, ఇండస్ట్రియల్, స్కిల్ డెవల్మేంట్, గృహ నిర్మాణం, జిల్లా నీటి యాజమన్య సంస్థ, రహదారులు భవనాలు, విద్యా, వైద్య, మహిళా,

2లో

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఏమైంది? : కెఎస్ లక్ష్మణరావు

పదో తరగతి విద్యార్థులకు ఏటా జిల్లా పరిషత్ అందించే స్టడీ మెటీరియల్ ఈ ఏడాది ఇంత వరకు ఇవ్వలేదని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అడిగారు. ప్రతి ఏటా డిసెంబరు 15 కల్లా ఇస్తారని, ఈ ఏడాది సిలబస్ మారడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, మరో 45 రోజుల్లో పరీక్షలు వస్తుంటే జిల్లా పరిషత్ అధికారుల మిన్నకుండిపోయారని విమర్శించారు. ఈ అంశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడు ఇస్తారో చెప్పండని నిలదీశారు. రెండ్రోజుల్లో ఇస్తామని జిల్లా పరిషత్ సీఈవో సమాధానం ఇచ్చారు. గుంటూరు నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభిస్తే 14వ అడ్డరోడ్డు వద్ద గేటు తెరిపించాలని కోరారు. రహదారుల గుంతలు పూడుస్తున్నామని చెబుతున్నా నారాకోడూరు, తెనాలిమధ్య కేవలం ఇసుక పోసి చేతులు దులుపుకొంటున్నారని ధ్వజమెత్తారు. కౌలు రైతులకు బ్యాంకులు రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని, నకిలీ విత్తనాలు విక్రయాలు, పురుగుమందులు విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, గుంటూరు ఛానల్ ఆధునీకరణ, పొడిగింపు పనులకు అవసరమైన భూసేకరణకు నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అభ్యంతరం లేని భూముల్లో నివాసాలు పట్టాలు ఇవ్వాలని, బీ ఫారమ్ స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

శాఖల వారీ సమీక్షలపై త్వరలో నిర్ణయం

- కౌలురైతుకు రుణలక్ష్యాలను పూర్తి చేయాలి : మంత్రి దుర్గేష్
- రేషన్ మాఫియాపై సిఎంతో చర్చిస్తాం : మంత్రి మనోహర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా స్థాయిలో శాఖల వారీగా సమీక్షలపై త్వరలో జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తామని పర్యాటక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. గుంటూరులోని కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మంత్రులు జిల్లాలకు రాకపోవడం, శాఖల వారీగా సమీక్ష చేయకుండా కేవలం డిఆర్‌సి సమావేశాలకే పరిమితం కావడంపై ప్రభుత్వ లక్ష్యాలు పూర్తికావడం లేదనే అంశంపై సిఎంతో చర్చిస్తామన్నారు. జిల్లా, నియోజకవర్గం స్థాయిలో శాఖల వారీగా వర్కుషాపులు నిర్వహించాలని, ప్రజా ప్రతినిధులను ఇందులో భాగస్వామ్యం చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చే మార్గదర్శకాలను ఎప్పటికప్పుడు ప్రజా ప్రతినిధులతో అధికారులు చర్చించాలన్నారు. రాష్ట్రంలో టూరిజం సర్క్యూట్‌లో కేవలం ఆలయాలను మాత్రమే చేర్చాలన్న ఉద్దేశ్యం లేదని, ఇందులో ఇతర చారిత్రక ప్రదేశాలు, పేరెన్నికగన్న చర్చీలు, దర్గాలు, మసీదులు కూడా చేరుస్తామని చెప్పారు. దీనిపై జిల్లా స్థాయిలో కలెక్టర్లు నిర్ణయం తీసుకోవచ్చన్నారు. రాజధాని పనులను ప్రభుత్వం త్వరలోనే పూర్తి చేస్తుందని, దీనిద్వారా జిల్లాలోని ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని అన్నారు. కౌలురైతుల కోసం త్వరలోనే కొత్త చట్టం తెస్తామన్నారు. సీసీఆర్సీ కార్డులున్న కౌలురైతులకు కచ్చితంగా బ్యాంకు రుణాలివ్వాలని, రుణ లక్ష్యాన్ని మార్చి 15లోగా పూర్తి చేయాలని చెప్పారు. రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగ దారుల వ్యవహారల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ కౌల్దార్లకు రుణాలపై నియోజకవర్గం వారీగా డ్రైవ్ చేపట్టాలన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసే వారిని అణచివేసేలా కేసులు నమోదు చేయాలని ఎస్పిలకు సిఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారన్నారు. రేషన్ వాహనాల (ఎమ్‌డియు)ను మరింత సమర్థవంతంగా ఎలా వినియోగించుకోవాలో సిఎంతో చర్చిస్తామన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మంత్రి దుర్గేష్‌కు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ వినతి - 5 లో

పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును గెలిపించుకుందాం

5 లో

తుళ్లూరు ఆత్మీయ సమావేశంలో యుటిఎఫ్ నాయకులు

ప్రాణం తీసిన వైద్యుని పొరపాటు

- కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లో చిన్నపేగు, యూరినరీ బ్లాడర్‌కు గాయం
- హడావుడిగా గుంటూరు జిజిహెచ్‌కు తరలింపు - చికిత్స పొందుతూ మృతి

ప్రజాశక్తి - తెనాలి

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ సమయంలో డాక్టర్ చేసిన పొరపాటు యువతి ప్రాణాన్ని తీసింది. తెనాలిలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో మహిళకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించగా ఆమెను గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో చేర్చగా ఆమె సోమవారం రాత్రి మృతి చెందారు. దీనిపై వివరాల ప్రకారం..

డెల్టా ప్రాంతంలో పెద్దసుపత్రిగా పేరుగాంచిన తెనాలి జిల్లా వైద్యశాలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ నిమిత్తం మంగళగిరి మండలం ఎర్రబాలేనికి చెందిన గాజుల పావని (32) ఈనెల 24న చేరారు. డాక్టర్ రాంబాబు ఆమెకు ఆపరేషన్ నిర్వహించారు. ఆపరేషన్ సమయంలో యూరినరీ బ్లాడర్, చిన్న పేగుకు గాయమవడంతో ఆమె పరిస్థితి విషమంగా మారి అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఇది గమనించిన డాక్టర్ రాంబాబు హుటాహుటిన ఆమెను

జిజిహెచ్‌కు తరలించాల్సిందిగా కుటుంబ సభ్యులకు తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ పావని సోమవారం రాత్రి పావని మృతి చెందారు. గాయం సెప్టిక్ కావడంతో మృతి చెందినట్లు వైద్యులు చెబుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రిలోనే ఉంచారు.

సాధారణంగా జరిగే కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లో వైద్యుల నిర్లక్ష్యం స్పష్టమైంది. ఆపరేషన్ సమయంలో ఏం జరిగింది అన్న విషయం వైద్యులు గోప్యంగా ఉంచారు. దీనిపై తెనాలి ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి వివరణ కోరగా ఆపరేషన్ సమయంలో డాక్టర్ రాంబాబు పొరపాటు వాస్తవమేనని చెప్పారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ జిల్లా వైద్యారోగ్య అధికారి పరిధిలోని అంశమని, దీనిపై తదుపరి విచారణ, ఘటనకు బాధ్యులైన వైద్యులపై చర్యలు వారి పరిధిలోని విషయమని చెప్పారు.

యానిమేటర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి

విఒఎల రెండో రోజు దీక్షల్లో నాయకుల డిమాండ్

వార్తలు లోపలి పేజీల్లో

ఉపాధ్యాయులకు షోకాజులు

ప్రజాశక్తి-గుంటూరు

తెనాలి ఐతానగర్‌లోని నన్నపనేని సీతారామయ్య సరస్వతమ్మ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎంకు, ఏడుగురు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక మంగళవారం షోకాజు నోటీసులు జారీ చేశారు. ఈనెల 27న మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీ సమయంలో పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులు సెలవులో ఉండటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంపై తెనాలి ఎంఇఒ నివేదిక అనుసరించి 28వ తేదీ నుండి ఎఫ్‌ఎ-3 పరీక్షలున్నా విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నారని హెచ్‌ఎంతోపాటు, ఏడుగురు ఉపాధ్యాయులకూ సంజాయిషీ కోరుతూ షోకాజు నోటీసులను డిఇఒ జారీ చేశారు. రెండ్రోజులలోగా వివరణ ఇవ్వాలని, దానిని అనుసరించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల పట్ల మంత్రి వ్యాఖ్యలు సరికాదు : యుటిఎఫ్

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధ్యాయుల పట్ల మంత్రి నాదెండ్ల మనోహర్ వాఖ్యలు సరికాదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెనాలిలో పాఠశాలను సందర్శించి హెచ్‌ఎం మందలిస్తూ మాట్లాడటంతోపాటు, ఆ వీడియోను వైరల్ చేయటం తగదని, మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు నిబంధనల ప్రకారమే సెలువులు తీసుకున్నారని, ప్రస్తుత జీఈఓల ప్రకారం హైస్కూల్స్‌లో ఉపాధ్యాయులకు హెచ్‌ఎం సెలవు మంజూరు చేస్తారని, 50 శాతానికి మించకుండా సెలవులు వినియోగించుకునే అవకాశం ఉందని తెలిపారు. నిబంధనల మేరకే సెలవు ఇచ్చినా హెచ్‌ఎంను దుర్భాషలాడుతూ, అందరి ముందూ కించపరుస్తూ మాట్లాడటం సరికాదని విమర్శించారు. హెచ్‌ఎంతోపాటు, ఉపాధ్యాయులకు షోకాజులు ఇవ్వటం సరికాదని, ఏదైనా పొరపాటుంటే సరిచేసుకునేలా సూచనలు చేయకుండా మందలించటం, షోకాజులివ్వటం సరికాదని, షోకాజు నోటీసులు తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

కిసాన్ డ్రోన్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - అమరావతి

పొలం పిలుస్తోందనిలో భాగంగా మండలంలోని నరుకులపాడు, ఎనికపాడు గ్రామాల్లో రైతులకు డ్రోన్ వినియోగంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హాజరై కిసాన్ డ్రోన్ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎస్కెఎఫ్ అహ్మద్ మాట్లాడుతూ మండలానికి 3 కిసాన్ డ్రోన్లు మంజూరయ్యాయని, ఒక్కోదాని ఖరీదు రూ.10 లక్షలని చెప్పారు. ఇందులో రూ.8 లక్షలు సబ్సిడీ వస్తుందని, రైతులు రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు బుధవారం నుండి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్వింటాళ్ రూ.7550కు కందుల కొనుగోలు

ప్రజాశక్తి - దాచేపల్లి

పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండలంలోని ముత్యాలంపాడులో మంగళవారం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారిని పాపకుమారి మాట్లాడుతూ రబీలో కంది, వేరుశనగ సాగు చేస్తున్న రైతులు రసాయన ఎరువులు తగ్గించి అధిక దిగుబడులు సాధించడంపై వివరించారు. ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా కంది పంటను క్వింటాళ్ రూ.7550 మద్దతు ధరకు రైతు సేవ కేంద్రాల ద్వారా కొంటామని చెప్పారు. మైక్రో ఇరిగేషన్ ద్వారా ఐదెకరాల్లోపు పొలం కలిగిన రైతులకు డ్రిప్ పథకం ద్వారా 90 శాతం సబ్సిడీ అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా డ్రోన్‌పై అందించే సబ్సిడీని వివరించారు.

పెదగార్లపాడును సందర్శించిన డ్వామా పీడీ

ప్రజాశక్తి - దాచేపల్లి

శ్మశానానికి దారి కోసం కలెక్టర్ గ్రీవెన్స్‌లో మండలంలోని పెదగార్లపాడు గ్రామస్తులు అర్జీనిచ్చిన నేపథ్యంలో గ్రామాన్ని డ్వామా పీడీ ఎం.సిద్ధలింగమూర్తి మంగళవారం సందర్శించారు. సిసి రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరారు. అనంతరం గ్రామంలో ఇటీవల నిర్మించిన సిసి రోడ్లు, మినీ గోకులాలను పీడీ పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో కె.మల్లికార్జునరావు, పిఆర్ ఎఈ ఎల్.శ్రీనివాస్ నాయక్, మాజీ ఎంపీటీసీలు కె.రామారావు, పరంజ్యోతి, టిఎ మీరావలి, క్షేత్ర సహాయకులు వెంకటేష్, హుస్సేన్ పాల్గొన్నారు.

పాత్రికేయుడు బిఎల్ నారాయణకు తుమ్మల సాహితీ పురస్కారం

ప్రజాశక్తి తెనాలి

పత్రికా రంగంలో మూడు దశాబ్దాలకు పైగా విశేష సేవలు అందిస్తున్న పాత్రికేయులు బిఎల్ నారాయణను అభ్యుదయ రచయిత తుమ్మల వెంకట్రామయ్య స్మారక పురస్కారంతో సత్కరించారు. స్థానిక నందుల పేట కవిరాజా పార్క్ వడ్లమూడి గోపాలకృష్ణ స్మారక భవనంలో మంగళవారం రాత్రి అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ మానసిక వైద్య నిపుణులు, ప్రవాస భారతీయులు డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి చేతుల మీదుగా పురస్కారాన్ని అందించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న అరసం అఖిలభారత అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి, సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్ ప్రసంగించారు. కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్షులు చెరుకుమల్లి సింగారావు, బొల్లి ముంత కష్ణ, ప్రముఖ బాల సాహితీ వ్యాప్త షేక్ అబ్దుల్ హకీమ్ జానీ, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అందరి నోట సమస్యల మాట

(మొదటి పేజీ తరువాయి)

శిశు సంక్షేమ శాఖ, డీఆర్డీఏ, మెప్మా, టూరిజం శాఖలకు సంబంధించిన అంశాలపై సభ్యులు చర్చించారు.

రేషన్ వాహనాలు వద్దు : రామాంజనేయులు

ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు మాట్లాడుతూ ఎమ్‌డియు వాహనాలు వచ్చిన తరువాత రేషన్ బియ్యం అక్రమ రవాణా ఎక్కువైందని, గతంలో ఉన్న విధంగా రేషన్ షాపుల్లోనే బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎంఎస్ఎంఈలలో ఉత్పత్తి చేసిన వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. స్టార్ట్ అప్ కంపెనీల ఉత్పత్తుల అమ్మకాలకు కొన్ని నిబంధనలు సడలించాల్సిన అవసరం ఉందన్నారు. మౌలిక సౌకర్యాలు లేని హౌసింగ్ లే అవుట్లలో మంజూరు చేసిన ఇంటి పట్టాలు, నిర్మాణాలు ప్రారంభించన ఇళ్ల పట్టాలను రద్దు చేసి ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పట్టణ ప్రాంతాల వారికీ రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల వారికీ మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని కోరారు.

కార్డులు రద్దు చేస్తామని నోటీసులివ్వండి : శ్రావణ్‌కుమార్

తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ కుమార్ మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టడానికి రెవెన్యూ, పోలీస్, పౌర సరఫరా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ బియ్యం అమ్ముకునే లబ్ధిదారులకు కార్డులు రద్దు చేస్తామని నోటీసులు ఇవ్వాలన్నారు. మేడికొండూరు మండలంలో అనర్హులకు పంట నష్టపరిహారం అందించిన వ్యవసాయశాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తాడికొండ నియోజకవర్గం పరిధిలోని నాగార్జున సాగర్ కెనాల్ మరమ్మతులు చేయాలన్నారు. టూరిజం సర్క్యుట్‌లో జిల్లాలోని ప్రసిద్ధ దర్గాలు, చర్చీలను అనుసంధానం చేయాలని, కొండవీటి సర్కిల్‌లో ఫిరంగిపురం కార్మెల్ మాతా చర్చిని చేర్చాలని కోరారు.

కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఉండాలి : నశీర్ అహ్మద్

గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నశీర్ అహ్మద్ మాట్లాడుతూ గుంటూరులో కామన్ ఫెసిలిటీ సెంటర్ల

ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రభుత్వ వాటాను పీపీపీ విధానంలో అందించే అవకాశాలను పరిశీలించాలన్నారు. కాకుమానువారితోటలో జిజిహెచ్ అదనపు నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు త్వరగా మంజూరు చేయాలని కోరారు.

గ్యాస్ ప్రమాదాలను అరికట్టండి : గళ్లా మాధవి

గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ ప్రమాదాల నష్ట పరిహారం వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కృష్ణ నగర్‌లోని రైతుబజార్ నిర్మాణం వెంటనే ప్రారంభించాలని, అప్పటి వరకు అక్కడ కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. జిజిహెచ్ వైద్యులు నాణ్యమైన సేవలను అందించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల, తాగునీటి సౌకర్యాలు కల్పించాలన్నారు. గుంటూరులో దాదాపు 50 పాఠశాలల్లో మౌలిక వసతులు లేవన్నారు.

గ్యాస్ నగదు జమలో ఇబ్బందులు : నరేంద్ర

పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ దీపం-2 పథకంలో నగదు జమలో ఇబ్బందులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెటింగ్ కమిటీలోని గొడౌన్లను మరమ్మతులు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సీజన్ పూర్తవుతున్నా మార్కెటింగ్ శాఖ పట్టించుకోవడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు సక్రమంగా చేయాలన్నారు.

విజిలెన్సు వ్యవస్థను పటిష్టం చేయండి : ఏసురత్నం

ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుక పౌర సరఫరాలో ప్రత్యేకంగా విజిలెన్స్ విభాగాన్ని బలోపేతం చేయాలన్నారు. జిజిహెచ్‌కు పూర్వ విద్యార్థుల సహకారం తీసుకోవాలన్నారు. ఇందుకోసం మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థులను సంప్రదించాలన్నారు.

రహదార్ల మరమ్మతులను పూర్తి చేయండి : అనూరాధ

శాసన మండలి చీఫ్ విప్ పంచుమూర్తి అనురాధ మాట్లాడుతూ తెనాలి, మంగళగిరి రోడ్డు పనులు ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రశ్నించారు. రైతులకు సాగునీరు సక్రమంగా అందించేలా కెడబ్ల్యు కెనాల్ మరమ్మతులు చేపట్టాలని, మంగళగిరి నియోజకవర్గంలోని రహదారుల మరమ్మతులు వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు.

ఉర్దూ పాఠశాలలకు మినహాయింపు ఇవ్వండి : కల్పలత

ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి మాట్లాడుతూ తాడేపల్లి పట్టణం డోలాస్ నగర్‌లోని నివాసం ఉంటున్న వారికీ పట్టాలిచ్చే అవకాశం పరిశీలించాలన్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్ విలీనంలో ఉర్దూ స్కూల్స్‌కు మినహాయింపు ఇవ్వాలన్నారు.

చేనేత కార్మికులకు అండగా ఉండండి : హనుమంతరావు

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ చేనేత కార్మికులు సమస్యలను పరిష్కరించేలా, ఆప్కో ఉత్పత్తులు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపి నిధులతో ఈమని వద్ద చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు.

బ్యాంకర్లతో చర్చిస్తాం : కలెక్టర్ నాగలక్ష్మి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ కౌలురైతులకు రుణాలు మంజూరు చేసేలా లీడ్ బ్యాంక్ మేనేజరు, వ్యవసాయశాఖ బ్యాంకర్లను సమన్వయం చేసుకొని లక్ష్యాలను అధిగమించాలన్నారు. దుగ్గిరాలలో శుభం కోల్డ్ స్టోరేజీ అగ్నిప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు పరిహారం ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇండస్ట్రీపాలసీపై అవగాహన కోసం జిల్లా స్థాయిలోను, నియోజకవర్గంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసి ప్రణాళికలు రూపొందిస్తున్నాని చెప్పారు. సమావేశంలో చర్చించిన అంశాలపై అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోని నివేదికలు అందించాలన్నారు. రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ శాఖల వారీగా ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేస్తే సాధ్యమైనంత వరకు సమస్యలు పరిష్కరించాలన్నారు.

ఐఇసిఇ కంపెనీలో 72 మంది కృష్ణవేణి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ఐఇసిఇ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 78 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. కంపెనీ ప్రతినిధులు టెక్నికల్, హెచ్ఆర్ రౌండ్స్‌లలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 124 మంది పాల్గొనగా 72 మంది ఎంపికయ్యారన్నారు. వీరు డిగ్రీ పూర్తయిన అనంతరం సాఫ్ట్ స్కిల్ ట్రైనర్‌గా విధులు నిర్వహిస్తారని, వార్షిక వేతనం రూ.2.40 లక్షలని సంస్థ హెచ్ఆర్ ప్రశాంత్ కుమార్ తెలిపారు.

ఘనంగా విఎస్సార్ అండ్ ఎన్‌విఆర్ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - తెనాలి :

స్థానిక విఎస్సార్ అండ్ ఎన్‌విఆర్ కళాశాల వ్యవస్థాపక దినోత్సవాలు మంగళవారం నిర్వహించారు. కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మహిళా కమిషన్ మాజీ చైర్పర్సన్ నన్నపనేని రాజకుమారి హాజరయ్యారు. వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు, ప్రతిభగల విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఆలపాటి మాట్లాడుతూ విలువలతో కూడిన వ్యక్తిత్వానికి నన్నపనేని వెంకటరావు నిదర్శనమన్నారు. పేద వర్గాల్లో విద్య వ్యాప్తికి ఆయన ఎంతగానో కృషి చేశారని చెప్పారు. రాజకుమారి మాట్లాడుతూ కళాశాల ద్వారా ఎందరో పేద విద్యార్థులు విద్యను అభ్యసించి, ఉన్నత స్థానాలకు ఎదిగారని చెప్పారు. కార్యక్రమంలో నన్నపనేని ముకుందరావు, కళాశాల సీఈఓ ఎన్ భాస్కర్, ఎన్‌విఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ అజయ్, విఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవీంద్రనాథ్, శ్రీ రామా రూరల్ విద్యాసంస్థల అధినేత కొలసాని తులసి విష్ణు ప్రసాద్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు వేస్తున్న వైద్యులు

గోశాలలో నట్టల నివారణ కార్యక్రమము

ప్రజాశక్తి-గుంటూరు

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం సౌజన్యంతో జనవరి 20 నుండి 31 వరకూ జరుగుచున్న పశు వైద్య శిబిరాలలో భాగంగా మంగళవారం వెటర్నరీ పాలీ క్లినిక్ గుంటూరు వారు స్థానిక నెహ్రనగర్‌లోని గోశాలలో నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 656 ఆవులకు, 155 దూడలకు నట్టల నివారణ మందు త్రాగించారు. ఈ కార్యక్రమాన్ని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహ్మద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఓ.నరసింహారావు, వెటర్నరీ పాలీ క్లినిక్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.రత్నజ్యోతి, డివిజనల్ డిడి డాక్టర్ కె.వి.వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా వంద పడకల ఆసుపత్రి పనులు

భవన నమూనాను పరిశీలించిన మంత్రి లోకేష్

ప్రజాశక్తి - మంగళగిరి

విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గం చినకాకాని వద్ద వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రిని దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణంపై అధికారులతో మంగళవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రదర్శించిన ఆసుపత్రి భవన నమూనాను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. మంగళగిరి నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కల వంద పడకల ఆసుపత్రి అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లోనే ఆసుపత్రిని మంజూరు చేయడం జరిగింది. దేశంలోనే అత్యుత్తమంగా ఉండేలా ఆసుపత్రిని తీర్చిదిద్దాలన్నారు. ఆసుపత్రి భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ది భార్గవ్ గ్రూప్ ఎండీ ఏ.భార్గవ్, డీజీఎమ్ కిషోర్, సీనియర్ ఇంజనీర్ అనిల్, ఏపీఎమ్ఎస్ఐడీసీ ఛైర్మన్ చల్లపల్లి శ్రీనివాసరావు, వీసీ అండ్ ఎండీ పీఎస్ గిరీష, వాస్తు కన్సల్టెంట్ జయరామిరెడ్డి, ఏపీఎమ్ఎస్ఐడీసీ సీఈ కె.శ్రీనివాసరావు, ఎస్ఈ వి.చిట్టిబాబు, ఈఈ సీవీ రమణ, డీఈఈ ఎమ్.హనుమంతరావు నాయక్, ఏఈ జి.గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమావేశం నిర్వహించిన మంత్రి నారా లోకేష్

నందిగం సురేష్‌కు బెయిలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఒక హత్య కేసులో నిందితుడుగా ఆరోపణలు ఎదుర్కొంటూ రిమాండ్‌లో ఉన్న మాజీ ఎంపి నందిగం సురేష్‌కు గుంటూరు నాల్గో అదనపు న్యాయమూర్తి మంగళవారం బెయిల్ మంజూరు చేశారు. రూ.10 వేల పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేశారు. తుళ్లూరు మండలం ఉద్దండ్రాయునిపాలెంలో జరిగిన ఒక దళిత మహిళ హత్య కేసులో కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. గత ఐదు నెలలుగా ఆయన గుంటూరు జైలులో ఉన్నారు. ఇప్పటికే ఆయనపై పలు కేసులు నమోదు అయ్యాయి.ప్రధానంగా 2021లో టిడిపి కార్యాల యంపై దాడి కేసులో ఆయన్ను తొలుత అరెస్టుచేశారు. తరువాత హత్య కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గల బొంబాయి కంపెనీ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని 80 సంవత్సరాల వృద్ధ రాలి మృతదేహాన్ని కనుగొన్నారు. మాచర్ల అర్బన్ ఎస్ఐ సంధ్యారాణి తెలిపిన వివరాల ప్రకారం వృద్ధురాలు సోమవారం సాయంత్రం మృతి చెందినట్లు ఉందని తెలిపారు. ఆమెను రెండు రోజుల క్రితం బొంబాయి కంపెనీ బ్రిడ్జి వద్ద వదిలిపెట్టి వెళ్లినట్లు తెలిసిందన్నారు. ప్రస్తుతము వృద్ధు రాలు మృతదేహం మాచర్ల ప్రభుత్వాసుపత్రిలో ఉన్నట్లు తెలిపారు. వివరాలు ఎవరికైనా తెలిసినట్లయితే మాచర్ల పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ ఫోన్ నెంబర్ : 9440796240, ఎస్సై : 8639901698 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

పొలాల్లో గుర్తు తెలియన మృతదేహం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం కొత్తపల్లి గ్రామ పొలాల్లో మంగళవారం 70 ఏళ్ళ వయసు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైతులు గుర్తించారు. రైతులు పొలం పనులకు వెళ్లిన సమయంలో పొలాలకు సమీపంలో బురదలో కూరుకుపోయిన మృత దేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ ఐ. మణికృష్ణ పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని బురదలో కూరుకుపోయిన వ్యక్తి మృతదేహాన్ని బయటకు తీయించారు. మాసి పోయిన తెల్లగడ్డంతో, ఆకు పచ్చ రంగు టీ షర్ట్ ధరించి ఉన్న మృతునికి సంబంధించిన వివరములు సేకరిస్తున్నా మని ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తామని తెలిపారు.

రాజధానిలో పోలీసుల విస్తృత గాలింపు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని గ్రామాల్లో ఈనెల 26 తేదీ అర్ధరాత్రి దొంగతనాలకు పాల్పడినవారిని పట్టుకునేందుకు పోలీసులు విస్తృత గాలింపు చర్యలు చేపట్టినట్లు సిఐ గంగా వెంకటేశ్వర్లు చెప్పారు. సిసి పుటేజీలను పరిశీలించడంతో పాటు దొంగలు వినియోగించిన కారు నంబర్‌ను తెలుసుకునేందుకు ప్రయత్ని స్తున్నామని, త్వరలోనే దొంగతనాలకు పాల్పడిన వారిని పట్టుకుంటా మని చెప్పారు. దొంగతనాలకు పాల్పడిన వారు ఆకతాయిలా.. దొంగలా అనేది స్పష్టం కాలేదన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రాజధాని గ్రామం రాయపూడిలో ఒక ఇంటిలో భార్యాభర్తలు నిద్రిస్తున్న సమయంలో దొంగలు ప్రవేశించి సెల్ ఫోన్ ఎత్తుకెళ్లారన్న ఫిర్యాదు మేరకు కేసు విచారణ జరుపుతున్నామని చెప్పారు. దొండపాడు, బోరు పాలెంలో జరిగిన దొంగతనాల గురించి సిఐ ప్రస్తావిం చలేదు. రాజధాని నేపథ్యంలో అనేక ప్రాంతాల నుంచి రకరకాల కొత్త వ్యక్తులు వస్తుంటారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సిసి కెమెరాలను అమర్చుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే 100, 112 లేదా 9440900860 నంబర్లకు ఫోన్ చేయా లని సూచించారు. రాజధాని గ్రామాల్లో పోలీసు గస్తీ పెంచుతా మని, ప్రజలు పోలీసులకు సహకరించాలని సిఐ కోరారు.

ఇద్దరు అంతర్‌జిల్లాల దొంగల అరెస్టు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగలు ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్.పి. సతీష్ కుమార్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాల యంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలలో జరిగిన పలు నేరాల కి సంబంధించి ఆకుల శ్రీను (32) నాగ దాసరి మహేష్ (32) లని అరెస్ట్ చేశామని బంగారు షాపులే టార్గెట్ గా వీరు దొంగతనాలు పాల్పడుతున్నట్లు తెలిపారు. మొత్తం ఆరు దొంగతనాల కేసుల్లో రూ.28 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సిసి కెమెరాల పుటేజీతో నిందితుల ఆచూకిని కనుగొన్నామని తెలిపారు. వీరిద్దరు కడప జిల్లాకు చెందిన వ్యక్తులుగా పేర్కొన్నారు. వీరిని అడవితక్కెళ్లపాడులో అరెస్టు చేసినట్లు ఆయన వివరించారు. వీరితో పాటు తమిళనాడుకు చెందిన చంద్రన్ అనే నిందితుడు కూడా ఈ చోరీల్లో ఉన్నాడని అతను పరారీలో ఉన్నాడని తెలిపారు. గుంటూరు అదనపు ఎస్పీ సుప్రజ, డిఎస్‌పి శివాజీ రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వాధీనం చేసుకున్న ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

అవినీతి నిరోధక విభాగం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యునిగా వేణుగోపాల్

ప్రజాశక్తి-గుంటూరు : రాష్ట్ర అవినీతి నిరోధక విభాగం స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా గుంటూరుకు చెందిన అన్నంగి వేణుగోపాల్‌ను నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు మదిరే రంగసాయిరెడ్డి అధ్యక్షతన తిరుపతిలో జరిగిన ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారంలో వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను నియమించారు. అవినీతి నిరోధక విభాగానికి గుంటూరుకు చెందిన అన్నంగి వేణుగోపాల్ ను నియమిస్తూ నియామక పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు కేటాయి ంచిన రంగసాయిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో అవినీతిని నిర్మూలనకు కృషి చేస్తానని చెప్పారు.

గిరిప్రదక్షణకు ఆర్టీసీ స్పెషల్ బస్

ప్రజాశక్తి-గుంటూరు : అరుణాచలంలో ఫిబ్రవరి 12వ తేదీన, పౌర్ణమి సందర్భంగా జరిగే గిరిప్రదక్షణ మహోత్సవాలకు ఆర్టీసీ గుంటూరు- 2 డిపో నుండి స్పెషల్ హైటెక్ పుష్ బ్యాక్ బస్ ఏర్పాటు చేశామనిడిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలామ్ ఒక ప్రకటనలో తెలియ జేశారు. 10వ తేదీ రాత్రి 9:15 గంటలకు గుంటూరులో బయలుదేరి, 11న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శం చుకొని, అదేరోజు రాత్రి అక్కడ నుండి బయలుదేరి 12న ఉదయం అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. అదేరోజు అరుణాచలేశ్వరుని దర్శించుకొని, ఫిబ్రవరి 12న సాయంత్రం అరుణాచలంలో బయలుదేరి ఫిబ్రవరి 13న ఉదయం 6:30 గంటలకు గుంటూరు చేరుతుందని తెలిపారు. 96164 నెంబర్ ద్వారా ఆన్లైన్ రిజర్వేషన్ చేసుకొనే అవకాశం కల్పించామన్నారు. ఒక్కొక్క టిక్కెట్ ధర రూ.2420లు మాత్రమేనని, కావున గుంటూరు పరిసర ప్రాంత ప్రయా ణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని కోరారు. అదనపు సమాచారం కోసం 7382897459, 7382896640లో సంప్రదించాలన్నారు.

ఆర్టీసీలో డయల్ యువర్ డిపో ద్వారా అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు : ఆర్టీసి గుంటూరు-2 డిపోలో డిపో మేనేజర్ ఎస్.కె.అబ్దుల్ సలాం మంగళవారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకూ డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించి ప్రయాణి కుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. మంగళగిరి నుండి గుంటూ రుకు ఉదయం 8.20 నుండి 9.20 వరకూ బస్సులు లేవని, కావున బస్ సౌకర్యం కల్పించాలని డి.ఉమామహేశ్వరరావు కోరారు. గుం టూరు నుండి విశాఖ పట్నంకు ఏసీ బస్సులు నడపాలని జె.మోహనరావు కోరారు. అలాగే గుంటూరు నుండి జూబ్లీ బస్టేషన్, మేడ్చల్‌కు బస్సులు నడపాలని గుంటూరుకు చెందిన జ్ఞానయ్య కోరారు.

IN THE COURT OF THE HON'BLE XXV ADDL CHIEF JUDGE, CITY CIVIL COURT AT :: HYDERABAD
EP NO. 1895 OF 2019
IN
ARB. NO. 74 OF 2012

Between:
M/s. SHRIRAM CITY UNION FINANCE LTD.(KUKATPALLY) Branch
...DECREE HOLDER
AND
R. Shankar Rao & OTHERS
...JUDGMENT DEBTORS

TO
3.S.K. Mahaboob Subhani, S/o S. K. Saiba, AE Major, # 4-33-12/2, Venkateshwara Nagar, Kukatpally. Hyd. Residing at H. No:58-60, Unit Quarters Mangalagiri Police Quarters Guntur-522 503, Emp.Id: 1835.
...JDR. NO. 3

Please take notice that the above E.P. is filed for you for recovery of Rs. 5,48,424 /- (Rupees Five Lakhs Fourty Eight Thousand Four Hundred Twenty Four Only) and the same posted to 10-02-2025 for your appearance in the Court at 10.30 A.M. if you fail to attend the court on that day the matter will be heard and decided exparte.

(BY ORDER OF THE COURT)
C. AMBHA SHANKER
Advocate
Hyderabad.
COUNSEL FOR THE DECREE HOLDER

NOTICE
IN THE COURT OF THE HON'BLE PRL.CIVIL JUDGE(SENIOR DIVISION):: TENALI
I.A.No.19/2023 in O.S No:189/ 2018

Between:
Tholuchuri Manmada Rao & Another
..... Petitioners/Plaintiffs
And
Tholuchuri Koteswaramma & Others
..... Respondents/Defendants

To,
R-7: Gampala Rohit Kumar, S/o.Late Rambabu,
R-9:Gampala Gopikrishna, S/o. Late Rambabu,
R-7 and R-9 are being minors rep. by their mother Kameswaramma, W/o.Late Rambabu, both are R/o.Yerrabalem, Chekuri Mdl, Tenali Taluk,Guntur Dist.

పై నెంబరు దావాలోని ఐ.ఏ.నెం.19/2023 పిటీషనులో 7 & 9 వ రెస్పాండెంట్లు అయిన మీకు పై కోర్టు వారి నుండి నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:10-02-2025 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేక మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షంగా విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:10-02-2025
యమ్.శ్రీనివాస రావు,
పిటీషనర్లు/వాదులు తరపు అడ్వకేట్,
గుంటూరు.

ఫెడరల్ బ్యాంక్ నిడుముక్కల బ్రాంచి
మీ పరిపూర్ణ బ్యాంకింగ్ భాగస్వామి

Address: Ground floor, D No. 6-212, Opp Anjaneyaswamy temple, Nidumukkala Village, Tadikonda mandal, Guntur district, AP-522016

ఫెడరల్ బ్యాంక్, నిడుముక్కల బ్రాంచ్ వారు గోల్డ్ అప్రైజరుగా నియమించడానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులనుకోరుచున్నారు.

ఆసక్తి గల అభ్యర్థుల క్రింద పేర్కొన్న నిబంధనలు మరియు షరతులకు లోబడి నిడుముక్కల శాఖను సందర్శించడం ద్వారా నిర్ణీత ఫార్మాట్లో తమ దరఖాస్తును సమర్పించవచ్చును.

1) అభ్యర్థులు నిడుముక్కల మరియు గుంటూరు పట్టణానికి చెందినవారై ఉండాలి.
2) అభ్యర్థులు సంప్రదాయ గోల్డ్‌స్మిత్ మరియు బంగారు ఆభరణాల తయారీలో/ మదింపు చేయడంలో మంచి అనుభవం కలిగి ఉండాలి.
3) అభ్యర్థులు కనీస విద్యార్హత 10వ తరగతి (SSLC) ఉత్తీర్ణత కలిగి ఉండాలి. మరియు 27-01-2025 నాటికి 60 సంవత్సరాలు మించకూడదు.
4) అభ్యర్థులు జ్యువెలరీ మేకింగ్/అప్రైజర్ రంగంలో కనీసం 2 సంవత్సరాలు అనుభవం కలిగి ఉండాలి.
5) అభ్యర్థులు భారతదేశ పౌరులై ఉండాలి.

తదుపరి నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి ఫెడరల్ బ్యాంక్ యొక్క నిడుముక్కల శాఖను సంప్రదించండి.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, సత్తెనపల్లి.
O.S. No. 572/2022

బిట్వీన్ :
దగ్గుబాటి సుభాష్ ..... వాది
అండ్
సోమేపల్లి నరసింహారావు ... ప్రతివాది

టు,
సోమేపల్లి నరసింహారావు, తండ్రి : పున్నయ్య, నివాసం : డోర్ నెం. 15-10-11, వడ్డవల్లి, సత్తెనపల్లి టౌన్ మరియు మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు గల దావాలో వాది మీపై ప్రామిసరీ నోటు బాకీ నిమిత్తం దావా దాఖలు చేయగా మీకు కోర్టు ద్వారాను, పోస్టు ద్వారాను సమన్లు పంపియున్నారు. మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు మీ యొక్క హాజరు నిమిత్తం ది. 30-01-2025న వాయిదా వేసియున్నారు. ఆ రోజున మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేయవలసినదిగా యిందు మూలంగా తెలియజేయడమైనది. లేనిచో మీపై పరోక్షంగా తీర్మానించబడును. ఇందుమూలంగా తెలియ జేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేదీ : 30-01-2025

ఇట్లు
శ్రీ పి.వి. నరసింహశాస్త్రి,
వాది తరపు న్యాయవాది,
సత్తెనపల్లి.

ఖననం చేసిన మృతదేహానికి రీపోస్టుమార్టం

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని కోట గ్రామానికి చెందిన మహమ్మద్ కరిముల్లా గత 18 నెలల క్రితం బావిలో పడి మృతి చెందారు. మృతదేహాన్ని గుంటూరులోని ఆనందపేట శ్మశాన వాటికలో ఖననం చేశారు. అయితే ఆస్తుల వివాదంలో తన తండ్రి మరణించారని మృతుని కుమారుడు సాదిక్ ఫిర్యాదు చేయడంతోపాటు హైకోర్టును ఆశ్రయించారు. రీపోస్టుమార్టంకు అనుమతులు పొందారు. ఈ నేపథ్యంలో ముస్లిమ్ మత పెద్దల అనుమతితో మతాచారం ప్రకారం మంగళవారం మృతదేహాన్ని వెలికి తీసి రీపోస్టుమార్టం నిర్వహించారు. డీఎస్పీ కే నాగేశ్వరరావు, గుంటూరు తూర్పు తహశీల్దార్ నగేష్, యడ్లపాడు ఎస్సై వి.బాలకృష్ణ సమక్షంలో మెడికల్ కాలేజి ప్రొఫెసర్ బృందం శవ పరీక్షలు చేసింది.

సిఎంను కలిసిన ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సిఎం చంద్రబాబును ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం కలిశారు. సత్తెనపల్లి నియోజకవర్గం నకరికల్లు బఫెలో బ్రీడింగ్ సెంటర్లో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. సత్తెనపల్లి నియోజకవర్గ అభివృద్ధికి దోహదపడేలా సత్తెనపల్లి పట్టణంలో ముంపు సమస్యకు పరిష్కారం చూపించే వరద నీటి కాల్వ నిర్మాణానికి రూ.22 కోట్లు మంజూరు చేయాలని. సత్తెనపల్లి పట్టణంలో ఆటోనగర్ ఏర్పాటుకు అనుమతులివ్వాలని కోరారు.

పాఠశాలల్లో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి - రాజుపాలెం

మండల కేంద్రమైన రాజుపాలెంలో పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మంగళవారం పర్యటించారు. జెడ్‌పి పాఠశాల, ఎంపిపి పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలు అర్థమవుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. స్టడీ మెటీరియల్‌ను చక్కగా వినియోగించుకుని నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన స్థాయిలను పరీక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఈవో చంద్రకళ, సత్తెనపల్లి ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, ఐసిడిఎస్ పీడీ ఉమాదేవి, తహసీల్దార్ ఎన్.దుర్గేశ్వరరావు, ఎంపిడిఒ సత్యనారాయణ, ఎంఇఒ మల్లికార్జునశర్మ పాల్గొన్నారు.

తహశీల్దార్ కిరణ్‌కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి- మాచర్ల రూరల్ : ఉత్తమ సేవా పురస్కారం పొందిన మాచర్ల తహసిల్దార్ కిరణ్‌కుమార్‌ను స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి, లాల్‌సాహెబ్ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన్ను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

ఒత్తిళ్లు, వేధింపులతోపాటు ఆర్థిక ఇబ్బందులు

రెండో రోజుకు యానిమేటర్ల దీక్షలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

చాలి, చాలనీ వేతనాలు, పని ఒత్తడి, రాజకీయ వేధింపులను భరిస్తూ విధులు నిర్వర్తిస్తున్న విఓఏలకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం దుర్మార్గమని శ్రామిక మహిళ సమన్వయ కమిటీ పల్నాడు జిల్లా కన్వీనర్ డి.శివకుమారి అన్నారు. తమ సమస్యలు పరిష్కారం కోసం ఏపి వెలుగు విఓఏ (యానిమేటర్)ల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో నరసరావుపేటలోని ధర్నా చౌక్‌వద్ద చేపట్టిన దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. దీక్షా పరులకు దండలేసి దీక్షలను ప్రారంభించిన శివకుమారి మాట్లాడుతూ గత ప్రభుత్వం తెచ్చిన కాలపరిమితి సర్క్యులర్ తక్షణం రద్దు చేయాలని, పెండింగ్ జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు విఒఎలు ఏళ్ల తరబడి పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వం వారి సమస్యలను గుర్తించి పరిష్కరించకపోవడం దారుణమన్నారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగడం లేదని అన్నారు. అరకొర వేతనాలు కూడా ఏడాదిన్నర కాలంగా ఇవ్వకుంటే కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి మాట్లాడుతూ విఓఏలకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షల్లో సంఘం జిల్లా అధ్యక్షులు ఏసమ్మ, కార్యదర్శి తాళ్లూరి రామారావు, విఓఏలు కోటేశ్వరరావు, షేక్ నన్నేసాహెబ్, శివలీల, మహాలక్ష్మి, సుజాత, ఉషారాణి, జరీనా, సుధామణి, లక్ష్మీ, ప్రమీల, అచ్యుతకుమారి, గౌస్య పాల్గొన్నారు.

దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న శివకుమారి

డీకే పట్టాలపై అటవీశాఖ, రెవెన్యూ శాఖల భిన్నవాదనలు

ప్రజాశక్తి - అచ్చంపేట

తాళ్లచెరువు రెవెన్యూ పరిధిలోగల సర్వే నంబర్ 320 నుండి 337 వరకు పేదలకు ఇచ్చిన డీకే పట్టాలపై అటవి, రెవెన్యూ శాఖాధికార్లు మల్లగులాలు పడుతున్నారు సోమవారం రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఆయా పొలాలను పరిశీలించడంతో అధికారుల్లో స్పందన వచ్చింది. అటవీ శాఖ డీఎఫ్ఓ రమణమ్మ, డీఆర్వో కుసుమకుమారి, ఎఫ్‌బీఓ యేసురత్నం, అచ్చంపేట డిప్యూటీ తహశీల్ధార్ జానీబాష, సర్వేయర్ యు.ఏడుకొండలు, వీఆర్వో శేషయ్య జాయింట్ యాక్షన్ కమిటీలో భాగంగా పొలాలను మంగళవారం పరిశీలించారు. అటవీ శాఖ అధికారులు 1940 రికార్డుల ప్రకారం మూడు నెలల క్రితం సాటిలైట్ చిత్రాల ఆధారంగా అటవీ శాఖ హద్దులను గుర్తిస్తున్నట్లు ఆ శాఖాధికారులు చెప్పారు. అయితే 1992లో అటవీ శాఖ అధికారుల అన్సర్ వే ల్యాండ్ ల్యాండ్ కింద చూపించిన రికార్డు ప్రకారం 1993 ఎఫ్ఎంబి చిత్రాల ప్రకారం రైతులకు డీకే పట్టాలను మంజూరు చేసినట్లు రెవెన్యూ శాఖాధికారులు చెబుతున్నారు. ఆర్ఎస్ఆర్ చూపించాలని అటవీ అధికారులు ప్రశ్నించారు. 30 ఏళ్ల క్రితం పట్టా పొందిన రైతు సుంకర ఆదినారాయణ అప్పటి రెవెన్యూ అటవీ శాఖాధికారులు వేసిన కొలతల సర్వే హద్దులు చూపించారు. అయితే దీన్ని అటవీ శాఖాధికారులు పరిగణలోకి తీసుకోపోవడంతో రైతుసంఘ నాయకులు వి.హనుమంతరావు, ఆర్.వెంకటేశ్వర్లు, కెకె రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. దీంతో పరిశీలనను అటవీ శాఖాధికారులు శనివారానికి వాయిదా వేశారు. డ్రోన్ సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తామని చెప్పి వెళ్లిపోయారు.

విఆర్‌ఏలతో రేయింబవళ్లు పని

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

గురజాల డివిజన్ పరిధిలోని విఆర్‌ఏలు శ్రమ దోపిడికి గురవుతున్నారని విఆర్‌ఏల పల్నాడు జిల్లా సంఘం అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ అన్నారు. మంగళవారం గురజాలలో ఆర్‌డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ గురజాల డివిజన్ పరిధిలో వివిధ మండలాల్లో ఖాళీగా ఉన్న నైట్ వాచ్‌మెన్, అటెండర్ పోస్టులను గ్రామ రెవెన్యూ సహయుకులచే తక్షణమే భర్తీ చేయాలని కోరారు. వివిధ మండలాల్లో తహసీల్ధార్ కార్యాలయాల్లో నైట్ వాచ్‌మెన్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, చాలా ఏళ్లుగా రెవెన్యూ కార్యలయాల్లో నైట్‌వాచ్‌మెన్, అటెండర్ డ్యూటీలు విఆర్ఎలే చేస్తున్నారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి,పగలు తేడా లేకుండా పని చేయిస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో ఉండి పనిచేయాల్సిన విఆర్‌ఏలను కార్యాలయ్యాల్లో అటెండర్లగా ఉపయోగిస్తున్నారని అన్నారు. పోస్టులను భర్తీ చేసి విఆర్‌ఎలను శ్రమ దోపిడీ నుండి విముక్తి చేయాలని డిమాండ్ చేశారు.

రెంటచింతలలో ఎడ్ల పందేల కోలాహలం

ప్రజాశక్తి - రెంటచింతల

పశు సంపద భారతీయ జీవన వ్యవస్థలో ఒక భాగమని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. కానుక మాత 175వ తిరుణాళ్ల సందర్భంగా మండల కేంద్రమైన రెంటచింతలలోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఒంగోలు జాతి ఎడ్ల ప్రదర్శన పోటీలను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. మొదటవిచారణ గురువులు నిర్వాహకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులకు చేదోడు వాదోడుగా ఉంటున్న వృషభ రాజులు దైవంతో సమానమన్నారు. కార్యక్రమంలో విచారణ గురువులు వై.పీటర్, పాపయ్య, వైఎల్ మర్రెడ్డి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రెండు పళ్ల విభాగంలో సత్తెనపల్లి ఎడ్ల జతకు ప్రథమ బహుమతి

ఎడ్ల బండలాగుడు పోటీల్లో భాగంగా రెండు పళ్ల విభాగంలో 3600 అడుగులు అడుగుల దూరాన్ని లాగిన సత్తనపల్లి, రామకష్టాపురానికి చెందిన నల్లబోతు ప్రవీణ్ కుమార్, రేపల్లెకు చెందిన బి.నాగరాజు ఎడ్ల జత మొదటి బహుమతిని కైవసం చేసుకున్నాయి. ద్వితీయ బహుమతి ముప్పాళ్ల మండలం మాదలకు చెందిన జువ్వాజి మేఘనాథ్ ఎడ్ల జత 3359 అడుగులు, మూడో బహుమతిని తకెళ్లపాడుకు చెందిన మోపర్తి నవీన్ కుమార్, హరిబాబు ఎడ్ల జత 3300 అడుగులు, నాలుగో బహుమతిని ఆకివీడుకు చెందిన బి.విజయలక్ష్మి ఎడ్ల జత 3254 అడుగులు, ఐదో బహుమతి నంద్యాలకు చెందిన పేరుమాళ్ల సంజయ్ కుమార్ ఎడ్ల జత 3221 అడుగులు, ఆరో బహుమతిని గిద్దలూరుకు చెందిన మలిబోయిన నాగార్జున ఎడ్ల జత 3163 అడుగుల దూరం లాగాయి. పోటీల్లో మొత్తం 15 ఎడ్ల జతలు పాల్గొనగా 9 ఎడ్ల జతలకు బహుమతులు ప్రదానం చేశారు. మిగతా ఆరు జతల యజమానులకు ఒక్కొక్కరికి రూ.3 చొప్పున ప్రోత్సాహకాలు అందించారు. పోటీలు 3వ తేదీ వరకూ జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఇదిలా ఉండగా పోటీలను చూడటానికి చుట్టుపక్కల ప్రాంతాలను నుండి భారీగా జనం రావడంతో ఆ ప్రాంగణం కిక్కిరిసి కోలాహలంగా మారింది.

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని అమలు చేయాలి

పేదల ఇళ్లకు పట్టాలు, ఇళ్లస్థలాలు ఇవ్వాలని ఆత్మకూరులో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

ఆత్మకూరులో వినతి పత్రం ఇస్తున్న నాయకులు పకీరయ్య తదితరులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఆత్మకూరు గ్రామంలో వివిధ పోరంబోకు స్థలాల్లో ఇల్లు వేసుకొని నివసించే పేదలందరికీ పట్టాలు ఇవ్వాలని కోరుతూ గ్రామ సిపిఎం ఆధ్వర్యంలో సచివాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మంగళగిరి మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు మాట్లాడుతూ లోకేష్ బాబు యువగళం సందర్భంగా నియోజకవర్గంలో ఇళ్లు వేసుకొని నివసించే పేదలందరికీ పట్టాలు ఇస్తానని ఇచ్చిన హామీ మేరకు నిమ్మగడ్డ రామ్మోహన్ రావు నగర్ కు నియోజకవర్గంలో వివిధ ప్రభుత్వ భూముల్లో నివసించే పేదలందరికీ నివాస పట్టాలు తో పాటు పక్కా గృహాలు నిర్మించుకోవడానికి ప్రభుత్వం పథకాలు ద్వారా ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అనంతరం సచివాలయ అధికారులకు మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ముసలి పకీరయ్య, నాయకులు చిట్టేల సీతా రామాంజ నేయులు, గడ్డం అజయ్ కుమార్, చిట్టేల జనార్ధనరావు, వెంగళ రామారావు,చిట్టేల గిరిధర రావు, ఆనందం బాబ్జి, వద్ది సురేష్, కోడూరు సుజాత మున గాల సంధ్య కటివరపు లక్ష్మి కత్తుల సురేష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మంగళగిరిలో సంతకాల సేకరణ

మంగళగిరిలో సంతకాల సేకరణలో బాలకృష్ణ తదితరులు

ప్రజాశక్తి - మంగళగిరి : పట్నంలోని 21, 22 వార్డుల్లో ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు వేసుకొని నివాసం ఉంటున్న వారికి అభ్యంతరాలు తొలగించి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, రాజధానిలో ఇళ్ల స్థలాల ఇచ్చిన వారికి స్థలాలు చూపించాలని కోరుతూ మంగళవారం 21,22 వార్డుల సిపిఎం శాఖల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ జరిగింది. ఇండియన్ టీ తిరిగి 134 సర్వే నంబర్లో ఉన్న భూమిలో సుందరయ్య నగర్, శ్రామిక నగర్, భగత్ సింగ్ నగర్ లలో 2500 మంది 19 83 నుండి ఇల్లు చేసుకొనే నివాసం ఉంటున్నారు. వారందరికీ పట్టాలు ఇవ్వాలని సంతకాలు సేకరించారు. సంతకాల సేకరించి సచివాలయ అధికారికి వినతి పత్రం అందజే యడం జరుగుతుందని సిపిఎం సీనియర్ నాయకులు పి బాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం చంద్రారావు, జే భార్గవ, కే ఆదినారాయణ పాల్గొన్నారు.

తుళ్లూరుకు 30న సిపిఎం రాష్ట్ర జాతా

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని నిర్మాణం, రాష్ట్ర అభివృద్ధి కోసం సిపిఎం తలపెట్టిన జాతాను జయప్రదం చేయాలని సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఫిబ్రవరి 1,2,3 తేదీలలో నెల్లూరులో జరగనున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభల నేపథ్యంలో ఈనెల 30న తాడేపల్లి నుండి ప్రారంభమై నెల్లూరు వరకు సిపిఎం రాష్ట్ర జాత పర్యటించనున్నట్లుగా తుళ్లూరులో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి ఒక ప్రకటనలో తెలిపారు. రాజధాని నిర్మాణం, రాష్ట్ర అభివృద్ధి నినాదంతో 30వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు రాష్ట్ర జాత తుళ్లూరులో పర్యటిస్తుందని తెలిపారు. రాజధాని నిర్మాణంలో స్థానికులకు పని కల్పించాలని అన్నారు. రాజధాని ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం అమలు జరపాలని కోరారు.

కౌలు రైతులందరికీ పంట రుణాలివ్వాలి

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు కె అజయ్‌కుమార్

ప్రజాశక్తి - తాడికొండ

కౌలు రైతులందరికీ పంట రుణాలు అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచమాటి అజయ్ కుమార్ కోరారు. మంగళవారం తాడికొండ సచివాలయంలో నిర్వహించిన కౌలు రైతుల సదస్సులో ఆయన మాట్లాడారు. మండలంలో సుమారు 1300 కౌలు రైతు కార్డులు మంజూరు చేశారని, వారందరికీ రుణాలు అందజేయాలని బ్యాంకు అధికారులను కోరారు. భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డు పొందిన ప్రతి కౌలు రైతుకు ఈ అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ఖరీఫ్ సీజన్లో రుణాలు పొందనివారు రబీ సీజన్లో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణం పొందడానికి అర్హులు అని అన్నారు. కౌలు రైతులందరికీక్రొత్త జిఓ ద్వారా గుర్తింపు కార్డులు అందించి రుణాలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కౌలుకు పొలం సాగు చేసే ప్రతి ఒక్క రైతు కౌలు కార్డులు పొందాలని అన్నారు. ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయిన కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వడం కొంతమేరకు ఊరట ఇస్తుందని అన్నారు. ప్రైవేట్ ఫైనాన్సుల్ వద్ద రుణాలు పొందకుండా బ్యాంకుల ద్వారానే రుణాలు పొందాలని ఆయన రైతులకు సూచించారు. కౌలు కార్డు పొందిన రైతులు ఈ క్రాప్ లో నమోదు చేసుకోవాలని అన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులకు రుణాలు అందించడంలో తమ వంతు కృషి అందిస్తామని అన్నారు. రుణాలు ఇవ్వడానికి నిరాకరించిన బ్యాంక్ అధికారుల వివరాలను వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అగ్రికల్చర్ ఏడి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరింత మందికి కౌలు కార్డులు అందించడానికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు,బాణావత్ భద్రయ్య,జోజి,కౌలు రైతులు,రైతులు పాల్గొన్నారు.

దళితులకు శ్మశాన స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి - తాడికొండ

దళితులకు స్మశాన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ ఉప తహసీల్దార్ నిర్మలా కృష్ణ కి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడారు. ఇటీవల తాడికొండ దళిత వాడలలో పర్యటించి వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవడం జరిగిందని అన్నారు. స్థానికులు స్మశాన వాటికలో స్థలం సరిపోక పాతి పెట్టిన ప్రాంతంలోనే మృతదేహాలను మరల పాతి పెట్టడం జరుగుతుందని అన్నారు. మాల సామాజిక వర్గానికి మాదిగ సామజికవర్గానికి కలిపి స్మశాన వాటిక ఉండడం వలన ఇద్దరికీ సరిపోవడం లేదని తెలిపారు. నాలుగు వేల కుటుంబాలకు 80 సెంట్ల స్థలం సరిపోదని, ప్రభుత్వం వెంటనే స్పందించి స్మశాన స్థలం కేటాయించాలని కోరారు. మురుగు పారుదల సరిగ్గా లేదని చిన్న వర్షానికి వాన నీరు రోడ్లపై నిలిచి దోమలు వృద్ధి చెంది అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేసి దళితవాడలో మురుగుపారుదలకు కాలువలు నిర్మించాలని ఈ సందర్భంగా వారు కోరారు. రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ శంగారపాటి బాబురావు, బాణావత్ భద్రయ్య, జోజి, రమేష్ పాల్గొన్నారు.

దళిత సాహిత్యం ఉన్నంత వరకూ సజీవులు ఎండ్లూరి సుధాకర్

ప్రజాశక్తి - తెనాలి

దళిత సాహిత్యాన్ని కొత్తపుంతలు తొక్కించిన ఆచార్య ఎండ్లూరి సుధాకర్ ఆ సాహిత్యం ఉన్నంతవరకు సజీవులేనని నరసరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కాకాని సుధాకర్ అన్నారు. రూరల్ గ్రామం కొలకలూరు బిజెఆర్, అంబేద్కర్ రీడింగ్ రూమ్ లో మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన ఆది జాంభవ దళిత ఉద్యోగుల సేవా సమితి(డెస్క్) నిర్వహించిన ఆచార్య ఎండ్లూరి సుధాకర్ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐఒసిఎల్ డీలర్ యడ్లపల్లి రవి కిరణ్ సారథ్యంలో నిర్వహించిన సభకు డెస్క్ అధ్యక్షులు డాక్టర్ పి జోసెఫ్ రత్నాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ కవి కోకిల గుర్రం జాషువా వారసుడిగా దళిత సాహిత్యంలో ఎండ్లూరి తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. విశిష్ట అతిథులుగా పాల్గొన్న డాక్టర్ పొన్నెకంటి విజయ కుమారి, సాహితీ రత్న నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి ఆచార్య ఎండ్లూరి తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఎండ్లూరి సుధాకర్ రచించిన 'వర్గీకరణీయం' పద్య కావ్యాన్ని సుద్దపల్లి శరత్ వెంకయ్య శబ్ద రూప కావ్యంగా మార్చగా దానిని ముఖ్య అతిథి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డెస్క్ ప్రతినిధులు ఉన్నం యెహెస్కేల్, ఎస్ మురళీధర్, మేకల రమేష్, కోడూరి సుదర్శన్, ఎస్ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంటూరు : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు)-హెచ్ 176 నాయకులు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కందుల దుర్గేష్‌ను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌కు వచ్చిన మంత్రికి యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 2022 పిఆర్‌సి అరియర్స్ వెంటనే చెల్లించాలని కోరారు. 2019 తర్వాత విధులలో చేరిన షిఫ్ట్ ఆపరేటర్లు వాచ్మెన్లు ఇతరులకు కొత్త, పాత వేతనాల తేడాలు సవరించి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. ప్రతి కార్మికునికి అన్ లిమిటెడ్ హెల్త్ కార్డులు ఇవ్వాలని, పీస్ రేట్ కార్మికులైన బిల్ కలెక్టర్స్, మీటర్ రీడర్లు, ఎస్పీఎం కార్మికులను జెన్కోలో పనిచేస్తున్న పీస్‌రేట్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల అర్హత బట్టి సీనియార్టీ ప్రాతిపదికన ఖాళీ అవుతున్న పర్మినెంట్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. తెలంగాణ తరహాలో కాంట్రాక్టు వ్యవస్థ రద్దుచేసి కార్పొరేషన్‌లో ఉద్యోగులను విలీనం చేసుకుని డైరెక్ట్ పేమెంట్ ఇవ్వాలి కోరారు. అలాగే కార్మికులకు జాతీయ, పండుగ సెలవు దినాలకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి.నాగరాజు, కోశాధికారి కె.రాంబాబు, నాయకులు దొడ్డా గంగాధర్, సిహెచ్ నాగవంశీ, ఎస్.డి.భాషా, తిరుపతిరావు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించుకుందాం

తుళ్లూరు , ఫిరంగిపురం ఆత్మీయ సమావేశంలో యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - తుళ్లూరు, ఫిరంగిపురం

ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావు విజయాన్ని ఆకాంక్షిస్తూ రాజధాని ప్రాంతం తుళ్లూరులో, ఫిరంగిపురంలోని రామాలయంలో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. తుళూరు ప్రజాసంఘాల కార్యాలయంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు ఎ శ్రీనివాసరావు అధ్యక్షతన యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సి హెచ్ ఆదినారాయణ మాట్లాడారు. ఉపాధ్యాయ,ఉద్యోగ, కార్మికుల పక్షాన నిబద్ధత,నిజాయితీ,సమస్యల పట్ల అవగాహన కలిగిన లక్ష్మణ రావును గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆయన సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ, రాజధాని ఏరియాలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి శాసనమండలిలో అనేకసార్లు మాట్లాడి ప్రభుత్వం దృష్టికి వెళ్లేలా కృషి చేసిన లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు మాట్లాడుతూ, అంగన్వాడీలు, ఆశాలు,మధ్యాహ్న భోజన పథకం,అసెంబ్లీ, సచివాలయం, వివిధ కార్యాలయాల్లో కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలపై నిరంతరాయంగా శాసన మండలిలో మాట్లాడటం,చర్చ జరిగేలా ముందుండి పని చేసిన వ్యక్తి లక్ష్మణరావని అన్నారు. సమావేశానంతరం మండల నూతన ఎమ్మెల్సీ ప్రచార కమిటీని ఎన్నుకున్నారు. కమిటీకి కన్వీనర్లుగా ఎం భాగ్యరాజ్ ,పి బాబు, జె నవీన్ ప్రకాష్, కో కన్వీనర్లుగా పి వెంకటేశ్వర్లు,టి భాస్కరరావు,టి పూర్ణచంద్రరావు, సమన్వ యకర్తగా ఎం రవి ని ఎన్నుకోవడం జరిగింది. ఫిరంగిపురం సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి షేక్ మస్తాన్వలి , రైతు సంఘం నాయకులు వెంగళరెడ్డి కే కోటేశ్వరరావు కౌలు సంఘం నాయకులు అంకమ్మరావు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు డి వేణు అంబేద్కర్ యూత్ నాయకులు ఎస్ మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

తుళ్లూరులో

ఫిరంగిపురంలో

నల్లగార్లపాడు సర్పంచ్ భర్త వెంకటరెడ్డి మృతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం నల్లగార్లపాడు సర్పంచ్ కట్టా రాజేశ్వరి భర్త వెంకటరెడ్డి మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సందర్శించి నివాళు లర్పించారు. రాజేశ్వరి కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామంలో వైసిపి విస్తరణకు వెంకటరెడ్డి చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. నివాళులర్పించిన వారిలో వైసిపి మండల అధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పి.రవీంద్రబాబు తదితరులున్నారు.

సదస్సు జయప్రదంపై ధన్యవాదాలు

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల కేంద్రమైన యడ్లపాడులో 'తెలుగు నాటకం-స్త్రీవాదం' అంశంపై ఆదివారం నిర్వహించిన సదస్సును జయప్రదం చేసిన అందరికీ 'వేదిక' అధ్యక్షులు డాక్టర్ ఎం.సురేష్‌బాబు ధన్యవాదాలు తెలిపారు. సదస్సుకు అనుమతిచ్చిన కేంద్ర సాహిత్య అకాడమీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. సదస్సుకు హాజరైన తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళన వేదిక సభ్యులు, సంస్కరణ ఉద్యమకారులు, రచయితలు, రంగస్థల నటులు, దర్శకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మహిళలకు, యడ్లపాడు గ్రామస్తులకు ధన్యవాదాలు చెప్పారు. భవిష్యత్తులోనూ వేదిక సంస్థ ద్వారా మరిన్ని సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

క్షతగాత్రునికి నిత్యాసరాలు వితరణ

ప్రజాశక్తి - యడ్లపాడు

పని చేసే క్రమంలో చేతి వేళ్లు కోల్పోయిన చుండ్రు వెంకటరమణమూర్తికి నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాయం చేశారు. బియ్యం, కందిపప్పు, నూనె, చింతపండు, సబ్బులు తదితర నిత్యావసరాలను మంగళవారం అందించారు. కార్యక్రమంలో నరేంద్ర సువర్ణ కుమారి, నరేంద్ర శ్యామ్ ప్రణీత్, వై.ప్రసాదరావు పాల్గొన్నారు.

చోరీకి గురైన ల్యాప్‌టాప్ రికవరీ

ప్రజాశక్తి - దాచేపల్లి

గత నెలలో పోగొట్టుకున్న ల్యాప్‌టాప్‌ను నడికుడి రైల్వే పోలీసులు స్థానిక రైల్వే స్టేషన్లో బాధితులకు అందజేశారు. గతనెల 23వ తేదీన సికింద్రాబాద్ నుండి గుంటూరుకు వెళ్ళే జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న బాపట్లకు చెందిన చింతల కిరణ్మయి భర్త బోసుబాబు పిడుగురాళ్ల స్టేషన్ దాటిన తర్వాత తమ ల్యాప్‌టాప్ బ్యాగును ఎవరో దొంగలించారని నడికుడి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేసిన పోలీసులు గురజాల పరిధిలో ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకుగాను నడికుడి రైల్వే ఎస్ఐ వి.శ్రీనివాసరావు నాయక్, ఎఎస్ఐ ఎ.వెంకట్రావు, కానిస్టేబుల్ ఎస్.రామరాజుకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రపతికి అంగన్వాడీల పోస్టుకార్డులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

తమకు గ్రాడ్యుటీ అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీలు రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు మంగళవారం పోస్టు కార్డులు పంపారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శి షేక్ హజ్రా మాట్లడుతూ అంగన్వాడీ వ్యవస్థ ఏర్పాటై 50 ఏళ్లయిన సందర్భంగా దీన్ని సంస్థాగతం చేయాలని కోరారు. గుజరాత్ హైకోర్ట్ తీర్పు ప్రకారం అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్‌ను వరసగా గ్రేడ్ 3, గ్రేడ్ 4 ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని, 7వ పే కమిషన్ సిఫార్సులకు అణుగుణంగా కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, రెగ్యులరైజేషన్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆరేళ్లలోపు పిల్లలందరికీ శిశు సంరక్షణ, విద్య, అభివృద్ధిని కట్టుదిట్టంగా అమలు జరిపే విధంగా చట్టం చేయాలని, అందుకు సరిపడా నిధులను బడ్జెట్‌లో కేటాయించాలని కోరారు. ఈ అంశాలపై ప్రభుత్వాన్ని నిర్దేశించాలని రాష్ట్రపతిని పోస్టుకార్డుల్లో కోరారు.

వ్యవసాయంలో నష్టమొచ్చినా పశుపోషణలో లాభాలే

ప్రజాశక్తి - యడ్లపాడు

రైతులకు అదనపు ఆదాయం అందించడానికే మేలుజాతి లేగ దూడల పోషణను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. యడ్లపాడులో ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధకశాఖ సంయుక్తంగా నిర్వహించిన మేలుజాతి లేగ దూడల ప్రదర్శనను ఆయన మంగళవారం ప్రారంభించారు. కొన్నింటికి స్వయంగా టీకాలు వేశారు. ఎక్కువ పాలదిగుబడి సాధిస్తున్న రైతులకు బహుమతులు అందచేశారు. రైతులు వ్యవసాయాన్ని ఎంత శ్రద్ధగా, పట్టుదలతో చేస్తున్నారో అదేవిధంగా పశుపోషణ చేపట్టాలని సూచించారు. వ్యవసాయంలో నష్టాలు వచ్చినా పశువులు, జీవాల పెంపకంలో మాత్రం నష్టం రాదన్నారు. పశుపోషణ, జీవాల పెంపకంపై ప్రభుత్వాలు అందించే పథకాలు, సబ్సిడీల గురించి రైతులు తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. వ్యవసాయంలో ఉండే ప్రశాంతత, సంతృప్తి మరే పనిలోనూ ఉండదని ఆయన చెప్పారు. నేటి యువత వ్యవసాయం, పశువుల పెంపకంపై ఆసక్తి చూపడం శుభపరిణామమని అన్నారు. కార్యక్రమంలో ఉపసంచలకులు పి.రామారావు, సహాయ సంచాలకులు టి.శ్రీనివాసరావు, జి.రామ్మోహన్‌రావు, డాక్టర్ రాధాకృష్ణ, జనసేన నియోకవర్గ ఇన్‌ఛార్జి టిజరాజారమేష్, టిడిపి నాయకులు కె.సాయిబాబు, కె.రత్తయ్య, పి.రాఘవరావు, పి.రామారావు, వెంకట రతయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దాచేపల్లి

మండలంలోని పెదగార్లపాడు, భట్రుపాలెం గ్రామాల్లో మంగళవారం పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. డాక్టర్ నార్ల చెన్నయ్య మాట్లాడుతూ పశువులు, దూడలకు నట్టల నివారణ మందులు వాడటం వల్ల పాల ఉత్పత్తి పెరుగుతుందని, ఆరోగ్య వంతంగా ఎదుగుతాయని చెప్పారు. దూడలకు క్రమం తప్పకుండా నట్టల నివారణ చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పశువులకు గర్భకోశం వ్యాధులు, చూడి, పరీక్షలు నిర్వహించారు. పెదగార్లపాడు సర్పంచ్ కర్పూరపు వెంకట కోటయ్య, మాజీ ఎంపిటీసీ పురంశెట్టి పరంజ్యోతి, కోరే రామారావు, మాజీ సర్పంచ్ కటికాల వరలక్ష్మి, కేలవత్ శివానాయక్, కేలవత్ వెంకట నాయక్, భూక్య బాలాజీ నాయక్, డాక్టర్ నార్ల చెన్నయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రెంటచింతల

రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా మండలంలోని పసర్లపాడులో మంగళవారం లేగదూడల ప్రదర్శనను నిర్వహించారు. 46 మంది పశుపోషకులకు చెందిన 54 పశువులకు చికిత్స చేశారు. గురజాల సహాయ సంచాలకులు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయానికి అనుబంధంగా పాడిపోషణతో రైతు కుటుంబాలు అదనపు ఆదాయం, ఆర్థిక స్వాలంబన లభిస్తుందని తెలిపారు. పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశు గణాభివృద్ధి వైద్యాధికారి చలపతిరావు, డాక్టర్ బషీర్, డాక్టర్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్ర మైన ఈపూరులో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహి ంచారు. శిబి రాన్ని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు పి.శ్రీనివాసమూర్తి పర్యవేక్షించగా మండల పశువైద్యాధికారి వి.గోపాల్ నాయక్ పరీక్షలు చేశారు. 85 దూడలు, 74 గేదలు, 25 ఆవులు, ఎద్దులు, 1850 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఆరు పశువులకు చూడి పరీక్షలు, మూడు పశువులకు కృత్రిమ గర్భధారణ, ఎదకు రాని నాలుగు పశువులకు వైద్య చికిత్స చేశారు.

ఫ్లయింగ్ టెన్నిస్ రాష్ట్ర జట్టుకు ఎన్ఇసి విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన వై.అనూష, జి.సుజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫ్లయింగ్ టెన్నిస్ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల పిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఈనెల 22వ తేదీన ప్రకాశం జిల్లాలోని చీమకుర్తిలోని భాష్యం స్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ ఫ్లయింగ్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రజట్ల ఎంపిక చేపట్టగా తమ విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. 8వ తేదీ నుంచి తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాలో జరిగే సౌత్‌జోన్ ఛాంపియన్షిప్ పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు చెప్పారు. వీరిని కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, పీడీలు ఎల్.కృష్ణారెడ్డి, ఎన్.ఝాన్సీరాణి, ఎన్.ఆంజనేయులు, పి.విజయకుమార్ అభినందించారు.

సైకిళ్లను అందిస్తున్న ఎస్ఐ, ఫౌండేషన్ నిర్వాహకులు

విద్యార్థినులకు 'స్నేహ హస్తాలు' సైకిళ్లు

ప్రజాశక్తి - అచ్చంపేట

స్నేహ హస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలికలకు మంగళవారం మూడు సైకిళ్లను పంపిణీ చేశారు. ఫౌండేషన్ ప్రతినిధి కరిముల్లాబాబు మాట్లాడుతూ మండల పరిధిలోని మాదిపాడు జెడ్‌పి పాఠశాలకు పులిచింతల ప్రాజెక్టు వద్ద ఉన్న జడపల్లి తండా నుండి రోజు 4 కిలోమీటర్లు నడచుకుంటూ విద్యార్థులు వస్తున్నారని చెప్పారు. వీరి ఇబ్బందులను తమ హెచ్ఎం అంకమ్మరావు తెలపగా సైకిళ్లను సమకూర్చినట్లు చెప్పారు. వీటిని ఎస్ఐ బి.వెంకటేశ్వరరావు ద్వారా విద్యార్థినులకు అందించారు. కార్యక్రమంలో ఎం.భద్రయ్య, పి.పుల్లారావు, కె.కుమారి పాల్గొన్నారు.

సత్రశాలలో శివారాత్రి ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి -రెంటచింతల

అందరం సమన్వయంతో పని చేసి ఎక్కడా లోటుపాట్లు రానియ్యకుండా వ్యవహరిస్తేనే ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. 26న నిర్వహించబోయే మహాశివరాత్రి వేడుకలపై సత్రశాలలో అధికారులతో ఆయన మంగళవారం సమీక్షించారు. సమావేశానికి ఎండోమెంట్ ఈవో గాదె రామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లో వోల్టేజ్‌ను నివారించడానికి అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, అంటురోగాలు ప్రబలకుండా వైద్య శిబిరం, తాగునీటి ఎద్దడి లేకుండా ట్యాంకర్లు ఏర్పాటు, ఆలయ పరిసరాలను శుభ్రం చేయడం గజ ఈతగాలని ఏర్పాటు, ఆవలి ఒడ్డు నుంచి పడవల నిషేధం, ఆర్టీసీ సర్వీసుల పెంపు, అన్నదాన సత్రాల నిర్వాహకులకు ఏర్పాట్లు, స్నానాలు చేసే సమయంలో అధిక సంఖ్యలో మహిళా పోలీసులు ఏర్పాటు క్యూ లైన్లు, ప్రతిష్టత తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఆర్డీవో మురళీకృష్ణ, తహశీల్దార్ నగేష్ పరాశక్తి సిమెంట్స్ వైస్ ప్రెసిడెంట్ ఎమ్మెస్ రాజు, ఎస్ఇ వెంకటరమణ, ఎంపీడీవో సరోజినీదేవి, టిడిపి మండల అధ్యక్షులు అబ్బిరెడ్డి, కోరే నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోస్టల్ శాఖను లాభాల్లోకి తెచ్చేందుకు కృషి : పెమ్మసాని

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

వ్యయం ఎక్కువ, ఆదాయం తక్కువగా ఉన్న తపాలా శాఖ అభివృద్ధి కోసం క్రింది స్థాయి నుండి అధికారుల అభిప్రాయాలు సేకరిస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుంచనపల్లిలో మంగళవారం తపాలా కార్యాలయాన్ని సందర్శిం చారు. స్థానిక తపాలా కార్యాలయ సిబ్బందిని పోస్ట్ ఆఫీస్ డిపాజిట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తపాలా శాఖ అభివృద్ధి కోసం, ఏమేమి చేస్తే బాగుంటుందో చెప్పాలన్నారు. పెనుమాక గ్రామానికి చెందిన కోనేరు గోపికృష్ణ దానికి బదులిస్తూ డ్వాక్రా సంఘాల కొన్ని గ్రూపులను బ్యాంకులకే కాకుండా, పోస్ట్ ఆఫీసులకు కూడా మళ్లించి రుణాలు ఇస్తే బాగుంటుందని, తద్వారా వచ్చే వడ్డీతో తపాలాను ముందుకు తీసుకు వెళ్ళవచ్చని చెప్పారు. స్పందించిన మంత్రి పెమ్మసాని పరిశీలిస్తామన్నారు. అనంతరం పెమ్మసాని మీడియాతో మాట్లాడారు. టెలికాం ప్రభుత్వంలో తపాలా ఒక భాగమైనది అని అన్నారు. ఇప్పటికే 25 వేల కోట్ల నష్టంలో ఉందని ఆయన తెలిపారు. తపాలా శాఖ గురించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసేందుకే వచ్చినట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమర సుబ్బారావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, టిడిపి తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్, తెలుగు రైతు గుంటూరు జిల్లా అధ్యక్షులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి, నాయకులు కాట్రగడ్డ మధుసూదన రావు, కానుగోలు కోటేశ్వరరావు, ఈ పూరి బాబు, అరవపల్లి శ్రీనివాసరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కుంచనపల్లి తపాలా కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి చంద్రశేఖర్

హామీ ఇచ్చిన సూపర్-6 పథకాలను అమలు చేయాలి

రావుల శివారెడ్డి విగ్రహావిష్కరణ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాల్సిందేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. మంగళగిరి పట్టణంలో సిపిఐ కార్యాల యం వద్ద ఏర్పాటుచేసిన అమరజీవి రావుల శివారెడ్డి విగ్రహా విష్కరణ కార్యక్రమంలో మంగళవారం రాత్రి పాల్గొని అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రజలకు అనేక వాగ్దానాలు చేసి నా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేమని చెప్పడం సరైనది కాదని విమర్శించారు. రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలు ఉన్నాయని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఇప్పటివరకు చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. ఇప్పుడు ఒకసారిగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని చెప్పి సంక్షేమ పథకాలను అమల చేయ లేమని చెప్పడం దారుణమని అన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిపోయిందని మాట్లాడిన చంద్రబాబు నాయుడు వాగ్దానాలు ఇచ్చేటప్పుడు ఎందుకు గుర్తు రాలేదని విమర్శించారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం లాగానే రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసి పరిపాలన చేస్తున్నారని విమర్శిం చారు. వైసిపి ప్రభుత్వం లాగే రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం కూడా రాష్ట్రాన్ని అప్పులు ఊబిలోకి నెట్టి వేస్తుందని విమర్శించారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ ప్రజలను చైతన్యపరిచి పోరాటాలను చేస్తుందని అన్నారు. ఈ ప్రాంతంలో కమ్యూనిస్టులు ఎక్కువగా ఉన్న ప్రాంతమని అన్నారు. ప్రజా సమస్యల కోసం నిరంతర పోరాటం చేసి అమరులైన వారికి నివాళులర్పించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, నియోజవర్గ సిపిఐ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సిపిఎం నాయకులు జెవి రాఘవులు, వివి జవహర్లాల్, జొన్నా శివశంకరరావు, ఎస్ ఎస్ చంగయ్య, వైఎస్ఆర్సిపి నాయకులు మునగాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా అమరజీవి రావుల శివారెడ్డి విగ్రహాన్ని సిపిఐ సీనియర్ నాయకులు ఈడుపుగంటి నాగేశ్వరావు నాగేశ్వరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ నాయకురాలు అక్కినేని వనిజ తదితరులు పాల్గొన్నారు.

రావుల శివారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఐ సీనియర్ నాయకులు ఈడ్పుగంటి నాగేశ్వరరావు తదితరులు

3వ రోజుకు బైబిల్ మిషన్ మహోత్సవాలు

ప్రజాశక్తి - పెదకాకాని

ప్రతి ఒక్కరు ప్రభువు పట్ల విశ్వాసం కలిగి ఉండాలని బైబిల్ మిషన్‌మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె. శామ్యేల్ కిరణ్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురు నిర్వహిస్తున్న మహోత్సవాలు మంగళవారం మూడవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగ పలువురు ప్రసంగిస్తూ ప్రభువుని స్థిర హదయంతో హత్తుకొనడం ద్వారా మనలో ఉన్న మాలిన్యం తొలగి పరిపూర్ణ వ్యక్తులుగా మారతామన్నారు. నేటి సమాజంలో నిరాశ, నిరుత్సాహం, అభద్రతాభావం వంటి అంశాలతో అనేకమంది ప్రజలు మనోవేదనతో ఉన్నారని తెలిపారు. కాబట్టి నేటి సమాజంలో ఉన్న ప్రజలు ఇతరుల పట్ల ప్రేమ కనబరుచుట, సత్కార్యములు చేయుట, సహవాసం, స్నేహభావం, తో పాటుగా పరస్పరం ప్రోత్సహించుకునేందుకు, దాతృత్వం చేసేందుకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో ప్రసంగిస్తున్న రాజేంద్రప్రసాద్

రాష్ట్ర అభివృద్ధిపైనే దృష్టి : ఆలపాటి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

కూటమి ప్రభుత్వ హయంలో చేపట్టిన పథకాలు, రాష్ట్ర అభివృద్ధిపై విస్తృత ప్రచారం చేయాలని కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కోరారు. మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఎన్డీయే కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపును కాంక్షిస్తూ గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల విస్తృత సమావేశం జరిగింది. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, గుంటూరు తూర్పు శాసనసభ్యులు మొహమ్మద్ నసీర్, గుంటూరు పశ్చిమ శాసనసభ్యులు గల్లా మాదవి, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, బిజెపి జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, టీడీపీ జోన్ 5 ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర, గుంటూరు నగర పార్టీ అధ్యక్షులు డేగల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జులు కూటమి ప్రభుత్వం చేపట్టిన రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, రాష్ట్రానికి వస్తున్న కంపెనీలు వంటి అభివృద్ధి ప్రచారంలో వివరించాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ వచ్చేవరకు కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని అన్నారు.లక్ష్మీపురం లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఓటర్ నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, ఓటర్ నమోదు అర్హత కలిగిన వారందరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, కనకాచారి, షేక్ లాల్ వజీర్, గుంటుపల్లి శేషగిరిరావు, పానకాల వెనక్తమహాలక్ష్మి, వేములకొండ శ్రీనివాస్, వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, కొమ్మినేని కోటేశ్వర రావు, ఈరంటి వరప్రసాద్ బాబు, పోతురాజు సమతా, ముప్పవరపు భారతి, నేపాక పద్మ, దాసరి జ్యోతి పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా పారిశుధ్య వ్యవస్థ మెరుగుదల

తెనాలి వార్డుల్లో పర్యటించిన మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - తెనాలి

క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా అడుగులు వేసేం దుకే వార్డుల పర్యటన చేపట్టినట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. వార్డుల పర్యటనలో భాగంగా మంగళ వారం ఆయన అయితా నగర్ ప్రాంతంలోని 39, 40 వార్డులలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు పర్యటనలో పలు సమస్యలు ప్రజలు ఆయన దృష్టికి తెచ్చినట్లు చెప్పారు. వాటిలో ప్రధానంగా రక్షిత మంచినీటి పథకం పూర్తిస్థాయిలో అమలుకావడంలేదని, వార్డులో శానిటేషన్ సమస్యలు తీసుకొచ్చారన్నారు. వార్డుల్లో రోడ్ల నిర్మాణం కారణంగా డ్రైన్ల లెవెల్ సరిగా లేదని దాని ఫలితంగా శానిటేషన్ సమస్యలు ఎదురవుతున్నట్లు, పెరిగిన జనాభా స్థాయికి అనుగుణంగా శానిటేషన్ సిబ్బంది చాలడం లేదని గుర్తించినట్లు చెప్పారు. అవసరమైతే సిబ్బందిని పెంచుకొని శానిటేషన్ వ్యవస్థ మెరుగుపడేలా చర్యలు తీసుకుంటామని ఈ మేరకు కమిషనర్‌తో చర్చిస్తామన్నారు. ఆయన వెంట చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, కమిషనర్ బి శేషన్న, తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ, హౌసింగ్ డిఈ రఫీ, వివిధ శాఖల అధికారులు, నాయకులు అత్తోట శరత్ బాబు, వార్డు శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరాలకు విశేష స్పందన

ప్రజాశక్తి-పెదనందిపాడు

మండలంలోని అన్న వరం, వరగానిలో మంగళ వారం నిర్వహించిన పశు వైద్యశిబిరాల్లో భారీ సంఖ్యంలో పశువులను పోషకులు తీసుకు వచ్చారని వైద్యులు తెలిపారు. అన్న వరంలో వెటర్నరీ డాక్టర్ బి స్వాతి విమల, వరగానిలో పశు వైద్య శిబిరం డాక్టర్ ఎన్ శైలజ (ఏడి) పెదనందిపాడు వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నవరంలో డాక్టర్ 42 దూడలకు, 100 గేదెలకు నట్టల నివారణ మందు వేసామని, 10 పశువులకు చూడి పరీక్షలు, 13 గేదలకు గర్భకోశ వ్యాధి పరీక్షలు చేశామని తెలిపారు. ఇతర చికిత్స పొందిన పశువులు 23 ఉన్నాయని, 210 గొర్రెలు మరియు మేకల కు నట్టల నివారణ మందులు వేసామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్ హరీష్ కన్నా , ఎంవి సుజాత లక్ష్మి , ఎం కావ్య , పి పవన్ కుమార్ , ఎస్.కె జాన్ వలి మరియు పాడి రైతులు పాల్గొన్నారు. వరగాని శిబిరంలో డాక్టర్ ఎన్ శైలజా మాట్లాడారు. 795 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు వేసామని, దూడలు 21, గేదెలు 30 కి నట్టల నివారణ మందు వేసామన్నారు. 11 గేదెలకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎమ్ అనిత, క్రాంతి కుమార్ , ఎస్ డోరతి, అశోక్, బాపయ్య, టి నవీన్ పాల్గొన్నారు.

యాజమాన్యానికి అనుకూలంగా ప్రభుత్వ వైఖరి

ఎసిసి కార్మికుల దీక్షా శిబిరంలో సిపిఎం నాయకుల విమర్శ

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

ఏళ్ల తరబడి పరిష్కారం కాకుండా ఉన్న, ఎసిసి కార్మికుల సమస్యను నిర్లక్ష్యం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యంకు అనుకూలంగా మాట్లాడడం సరైన పద్ధతి కాదని, సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఎసిసి కార్మికుల రిలే నిరాహార దీక్షలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ఎసిసి కార్మికులకు తాను గెలిస్తే, కార్మికుల సమస్య పరిష్కరిస్తానని చెప్పిన మాట లోకేష్ నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ కోర్టు ఆర్డర్ లను, ఏసిసి భూముల వేలం పాట నియమ నిభందనలను, సంబంధిత యాజమాన్యం ఉల్లంఘించిన రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని ఆయన అన్నారు. కార్మికుల పట్ల గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించ బట్టే తగిన బుద్ధి చెప్పారని అయన గుర్తు చేసారు. మంగళవారం దీక్షలలో వేముల రోజులు, అల్లం విజయ, డి రమణ, వేముల రమణమ్మ, వి లక్ష్మి, తదితరులు కూర్చున్నారు. దీక్షలకు సంఘీభావంగా కూరపాటి స్టీవెన్, ఏ ఎఫ్ టి యు నాయకులు కె ఆదినారా యణ, బి సూర్యప్రకాష్, డి మాణిక్యాలరావు, బి అంకయ్య, ఎస్ కే భాష, పిచ్చయ్య, రమాదేవి దుర్గాభవాని, శారద, సారమ్మ నాగేశ్వరరావు కృష్ణ, కోటేశ్వరరావు దానయ్య, యెహోషువ, సాల్మన్, తదితరులు పాల్గొన్నారు

దావోస్ పర్యటన రాష్ట్రానికే తలమానికం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

జాబ్‌లెస్ క్యాలెండరును ప్రకటించిన వైసిపి పాలనకు నిరుద్యోగ యువత చరమ గీతం పాడారని మాజి మంత్రి ఆలపాటి రాజేం ద్రప్రసాద్ అన్నారు. యువగళానికి రెండేళ్ళ పూర్తయిన సందర్భంగా స్థానిక విఎస్ ఆర్ అండ్ ఎన్వీఆర్ కళాశాల పరిపాలన విభాగం కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రి నారా లోకేష్ పాదయాత్ర ద్వారా ప్రజలకు ఒక భరోసా కల్పించారని అన్నారు. జాబ్ లెస్ క్యాలెండర్ ను ప్రకటించి యువతీ యువకులను మోసం చేసిన గత ప్రభుత్వం సిగ్గుపడేలా నిరుద్యోగ యువతకు 4.10 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అండతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అందిస్తున్న పాలనకు ప్రజలు నీరాజనాలు పదుతున్నారన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లాలని ఉద్దేశంతో దావోస్ పర్యటన ముగించుకున్నారని పేర్కొన్నారు. దావోస్ పర్యటన రాష్ట్రానికి ఒక మైలురాయని ఆలపాటి అన్నారు.

ఇవిఎంల గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

లాగ్‌బుక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నెలవారీ తనిఖీలలో భాగంగా సోమవారం ఉగుంటూరు కలక్టరేట్ ఆవరణలోని ఇవియంలు భద్రపరిచిన గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ తనిఖీ చేశారు. సిసి టివి పనీతీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. గోడౌన్ వద్ద భద్రత సిబ్బంది లాగ్‌బుక్‌ను పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలపై ఎక్స్‌పైరీ తారీఖు దగ్గర పడుతున్నందున సకాలంలో తగు చర్యలు తీసుకోవాలని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస రెడ్డిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఇవియంల భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామంలో వ్యవసాయ మార్కెట్ లో వీవీపాట్స్ భద్రపరచిన గోడౌన్ ను డిప్యూటీ కలెక్టర్ గంగరాజు (ఇన్‌చార్జ్ గుంటూరు ఆర్డీఓ) తనిఖీ చేశారు. కలక్టరేట్ ఇవియంల పరిశీలనలో డిఆర్ఓ షేక్. ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి, ఈఈ ఆర్ అండ్ బి విశ్వనాధరెడ్డి , కలక్టరేట్ హెచ్ సెక్షన్ పర్యవేక్షకులు మల్లేశ్వరి , ఫిరంగిపురం వీవీపాట్స్ పరిశీలనలో ఫిరంగిపురం తహాశీల్దార్ జె. ప్రసాదరావు పాల్గొన్నారు.

విజ్ఞాన్ వర్సిటీ విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి-గుంటూరు

రక్తదానం చేస్తున్న విద్యార్థులను అభినందిస్తున్న విజ్ఞాన్స్ వీసీ

రక్తదానం ప్రాణ దానంతో సమానమని, విద్యార్థులు అందరూ రక్తదానానికి పూనుకోవాలని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగ భూషణ్ పిలుపునిచ్చారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మంగళ వారం విద్యార్థులు రక్తదానం చేశారు. యూనివర్సిటీ లోని ఎన్ఎస్ఎస్ విభాగం, గుంటూరు జీజీహెచ్, నీడ్స్ బ్లడ్ బ్యాంక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి రెండు సెకన్లకు ఎక్కడో ఓచోట ఎవరో ఒకరికి రక్తం అవసరం అవుతూనే ఉందని తెలిపారు. విద్యార్థులు తాము రక్తదానం చేయడంతోపాటు మిత్రులను కూడా ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని కోరారు. రక్తదానం చేశాక శరీరం తాను కోల్పోయిన రక్తాన్ని 48 గంటల్లోగా తిరిగి భర్తీ చేసుకుంటుందని తెలిపారు. రక్తాన్ని కత్రిమంగా తయారుచేయలేమని, ఎవరైనా దానం చేస్తేనే లభిస్తుందన్నారు. కావున బాధితులను ఆదుకోవటానికి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. విజ్ఞాన్స్ విద్యార్థులు 552 మంది రక్తదానం చేశారని తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ.శ్రీనివాసబాబు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, ఎన్‌స్‌స్ విద్యార్థులు పాల్గొన్నారు.

బరువు తక్కువ శిశువులకు ప్రత్యేక చికిత్స

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ రాజా, డాక్టర్ శ్రీనివాసరావు, ప్రియాంక

తక్కువ బరువుతో పుట్టిన నవజాత శిశువులకు మెరుగయిన చికిత్స అందిస్తూ వారి ఎదుగుదలకి కృషి చేస్తున్నామని స్థానిక కొత్తపేట కనుమూరి ఆసుపత్రి అధినేత డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావు తెలిపారు. మంగళ వారం ఆసుపత్రిలో యేర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆసుపత్రిలో చికిత్స ఇద్దరు కవలపిల్లలు 600 గ్రాముల బరువుతో పుట్టారని వీరిని అత్యంత జాగ్రత్తగా చిలకలూరిపేట నుంచి గుంటూరుకి తరలించామని తెలిపారు. దాదాపు మూడు నెలల పాటు పూర్తి స్థాయిలో చికిత్స అందించి వారు రెండున్నర కిలోల బరువు వచ్చేలా కృషి చేశామని తెలిపారు. నిర్ణీత సమయాని కన్నా ముందే డెలివరీ కావడంతో పాటు అతి తక్కువ బరువుతో పుట్టిన కవలలు పూర్తి స్థాయిలో కోలుకునేలా వివిధ అంశాల్లో చికిత్సలు అందించినట్లు తెలిపారు. శిశు వైద్య నిపుణులు ఎ.వి.ఎన్. రాజా, డాక్టరు ప్రియాంక నేతృత్వంలో నవజాత శిశువులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ఇద్దరు కవలలకు డాక్టరు రాజా, డాక్టరు ప్రియాంక ఆధ్వర్యంలో మూడు నెలలు చికిత్స అందించినట్లు తెలిపారు. చిలక లూరిపేట లో కవలలను ప్రసవించిన హేమలత తో పాటు ఇద్దరు శిశువులను తామే అక్కడి నుంచి తమ ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తీసుకువచ్చామన్నారు. ఎటువంటి ఆరోగ్య సమస్యలు రాకుండా, ఇన్‌ఫెక్షన్ వంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. సాధారణంగా నెలలు తక్కువవగా, అతి తక్కువ బరువుతో పుట్టిన వారు బతకడం కష్టమని కానీ తాము ప్రత్యేక శ్రద్ధతో వారిని తిర్చిదిద్దినట్టు తెలిపారు.

పశువైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పల్నాడు కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు ఈ నెల 31 వరకు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అన్నారు. ఈ సందర్భంగా నరసరావుపేట మండలంలోని ములకలూరు గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన మెగా పశువైద్య శిబిరం, లేగ దూడల ప్రదర్శన, జంతు సంక్షేమ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు ప్రారంభించారు. పశు సంవర్ధక శాఖ ఏర్పాటు చేసిన లేగ దూడల ప్రదర్శనలో పాల్గొన్న ప్రతి ఒక్క రైతుతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. నేటి లేగ దూడలే రేపటి పాడి పశువులని రైతులు ప్రతి ఒక్క దూడ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. జీవాలకు స్వయంగా నట్టల నివారణ మందును త్రాగించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 1962 పశు వైద్య సంచార వాహన సేవలను, మినీ గోకులం, బహు వార్షిక క్షేత్ర సాగు పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డ్, పశు బీమా పథకాలు పాడి రైతులకు ఎంతో ఉపయోగకర మన్నారు. లేగ దూడల ప్రదర్శనలో 52 దూడలు పాల్గొనగా ఎంపిక చేసిన 3 దూడలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, అన్ని దూడలకు గౌరవార్ధక బహుమతులు అందజేశారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె. కాంతారావు మాట్లాడుతూ ఆదునిక సాంకేతికతో శాస్త్రీయ యాజమాన్య పద్దతులను అవలంబించుకొని పాలు, మాంసం, గుడ్లు పశువులలో పునరుత్పత్తి సామర్ధ్యం పెంచుతూ రాష్ట్ర స్థూల ఆదాయాన్ని పెంపొందించే దిశగా లక్ష్యాలు పెట్టుకొని పశు సంవర్ధక శాఖ నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. గుంటూరు ఉపసంచాలకులు డి.ఎల్.డి.ఏ డాక్టర్ బాల శంకర్ మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం ద్వారా 90 శాతం కచ్చితత్వంతో పెయ్య దూడలను పుట్టించడం జరుగుతుందని, పిండ మార్పిడి ప్రక్రియ ద్వారా అధిక పాల ఉత్పత్తి సామర్ధ్యం కలిగిన మేలుజాతి దూడలు పుడతాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.మధులత, ఎండిఓ టివి కృష్ణ కుమారి, ములకలూరు సర్పంచ్ మేరీ రత్నం, సహాయ సంచాలకులు డాక్టర్ కె.రామచంద్రరావు, నరసరావుపేట ప్రాంతీయ పశు వైద్యశాల డాక్టర్ సిహెచ్. కోటి రత్నం, పశు వైద్యులు అర్జునరావు, కళావతి, స్వర్ణలత, శ్రీదర్ రెడ్డి, శ్రీకాంత్, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యానిమేటర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి-గుంటూరు

కలెక్టరేట్ ఎదుట విఓఎల రెండోరోజు నిరసన దీక్షలో నాయకులు

యానిమేటర్ల దీక్షలో మాట్లాడుతున్న యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ

యానిమేటర్లపై రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు దండాలక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టరేట్ ఎదుట రెండో రోజు సామూహిక దీక్షల్లో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లాలో కొన్ని మండలాల్లో ఏపిఎంలు రాజకీయ కార్యకర్తల్లాగా వ్యవహరిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. యానిమేటర్లను అవినీతిపరులుగా చిత్రీకరించే విధానం మానుకోవాలన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే బ్రతుకులు బాగుపడతాయని ఆశించిన విఓఎల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు తయారైందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలగించిన విఓఎ లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. విఓఎ వ్యవస్థను సృష్టించానని చెప్పే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ వ్యవస్థలో పేరుకుపోయిన లోపాలను ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. తక్షణమే యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతన బకాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అక్రమంగా తొలగించిన యానిమేటర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోర్టు ఆర్డర్ తెచ్చుకున్నప్పటికీ అధికారులు అమలు చేయట్లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నష్టదాయకంగా ఉన్న లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని కోరారు. కార్మిక వర్గం ఐక్య పోరాటాల ద్వారానే కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రెండో రోజు నిరాహార దీక్షలకు సిపిఎం జిల్లా కార్యదర్శి వై నేతాజీ, పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.శివకుమారి, కె.పద్మ, విజయ లక్ష్మి, జ్యోతి, షాజా, తదితరులు నాయకత్వం వహించారు.

సిఇఒ హామీతో దీక్ష విరమణ

కాగా యానిమేటర్ల సమస్యలు పరిష్కారానికి జాయింట్ కమిటీ ఫిబ్రవరి 4వ తేదీన ఏర్పాటు చేస్తామని సెర్ప్ సిఇఒ హామీ ఇవ్వటంతో నేడు జరగాల్సిన మూడోరోజు దీక్షలను వాయిదా వేస్తున్నట్లు నాయకులు తెలిపారు.

ట్రేడ్ లైసెన్స్‌లకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి

ప్రజాశక్తి-గుంటూరు

మస్టర్ పాయింట్ రికార్డులు తనిఖీ చేస్తున్న కమిషనర్

గుంటూరు నగరంలో వార్డు సచివాలయాల వారీగా డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్‌లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ వసంతరాయపురం, శారదా కాలనీ, రెడ్డిపాలెం, ఇన్నర్ రింగ్ రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి మస్టర్ పాయింట్స్, పారిశుధ్య పనులు, అభివృద్ధి పనులను పరిశీలించారు. తొలుత వసంతరాయపురం మస్టర్ పాయింట్‌ని తనిఖీ చేసి, కార్మికులు, కార్యదర్శుల హాజరును పరిశీలించి, సెలవుల రిజిస్టర్ లేకపోవడం గమనించి, తక్షణం రిజిస్టర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజారోగ్య కార్మికులకు ఇప్పటికే డెప్యుటేషన్లు రద్దు చేశామని, వారికి ఎఫ్ఆర్ఎస్ ద్వారానే జీతాలు ప్రాసెస్ చేయాలని స్పష్టం చేశారు. కార్యదర్శులు మస్టర్ సమయానికి విధులకు రావాలని, పారిశుధ్య నిర్వహణ విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయం వారీగా వ్యాపార సంస్థలు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఉన్నవారు రెన్యువల్ చేసుకునేలా కార్యదర్శులు, ఇన్స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మలేరియా డివిజన్ మస్టర్‌ని పరిశీలించి, కేటాయించిన ప్రాంతాల్లో యాంటీమలేరియా యాక్టివిటీ చేపట్టాలని కార్మికులకు తెలిపారు. వసంతరాయ పురం రిజర్వాయర్‌ని పరిశీలించి, నిర్దేశిత గడువు మేరకు పతినెల రిజర్వాయర్‌ని శుభ్రం చేయాలని ఏఈని ఆదేశించారు. అనంతరం రెడ్డిపాలెం రోడ్ విస్తరణ పనులను తనిఖీ చేసి, త్వరలో శంకర్ విలాస్ ఆర్‌ఓబి పనులు ప్రారంభించడం జరుగుతుందని, పనుల వలన ట్రాఫిక్ రెడ్డిపాలెం రోడ్ కి మళ్లించే అవకాశం ఉన్నందున విస్తరణ పనులు వేగంగ చేపట్టాలని ఆదేశించారు. పర్యటనలో సిఎంఓహెచ్ డాక్టర్ అమతం, సిటి ప్లానర్ రాంబాబు, డిసిపి సూరజ్ కుమార్, డిఈఈలు కళ్యాణరావు, రమేష్ బాబు, ఏసిపి మల్లికార్జున, ఆర్ఓ రవికిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.